ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

MHR TV

మెదక్ సంపుటి: 19 సంచిక : 76 మంగళవారం 18, నవంబర్ 2025 పేజీలు: 08 వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamabad-Adilabad -Vijayawada-Guntur-Vizag-Kurnool | www.prajaswaramdaily.com



# వచ్చే నెలలో స్థానిక ఎన్నికలు





## స్థానిక ఎన్నికలకు సర్కార్ సిద్ధం

ఈ నెల 24న కోర్ట్ వాయిదా, ఆదేశాల కోసం ఎదురుచూపులు
తీర్పు ఎలా ఉన్నా ఎన్నికలకు వెళ్దామంటున్న మంత్రులు?
24న ఏం జరుగుతుందో చూసి ముందుకెళ్ళాలని నిర్ణయం
జూబ్లీహిల్స్ గెలుపు తర్వాత పార్టీలో పెరిగిన కాన్ఫిడెన్స్
పార్టీ సింబల్‌తోనే ఎన్నికలకు వెళ్ళే యోచన
గ్రామాల్లో 80శాతం అనుకూలంగా ఉందన్న నివేదికలు
ప్రజాపాలన వారోత్సవాల అనంతరం నోటిఫికేషన్
కేబినేట్‌లో మంత్రులతో చర్చించిన సిఎం రేవంత్
ప్రజాపాలన వారోత్సవాల్లో గ్రామాల్లో పెద్ద ఎత్తున ప్రచారం
డిసెంబర్ 1నుంచి 9 వరకు ప్రజాపాలన వారోత్సవాలు

**హైదరాబాద్, ప్రజాస్వరం**

స్థానిక సంస్థల ఎన్నికలపై తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రజాపాలన వారోత్సవాల తర్వాత ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించింది. డిసెంబర్ 1 నుంచి 9 వరకు ప్రజాపాలన వారోత్సవాలు నిర్వహించనున్నారు. ఆ తర్వాత ఎప్పుడైనా ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది. మరోవైపు సౌదీ అరేబియాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం చెల్లించాలని కేబినెట్ నిర్ణయించింది. మంత్రి అజారుద్దీన్, ఎంఐఎం ఎమ్మెల్యే, మైనార్టీ విభాగానికి చెందిన ఓ అధికారితో కూడిన ప్రభుత్వ ప్రతినిధి బృందాన్ని వెంటనే సౌదీకి పంపించాలని సూచించింది. చనిపోయిన వారి మృతదేహాలకు మత సంప్రదాయం ప్రకారం.. అక్కడే అంత్యక్రియలు నిర్వహించాలని నిర్ణయించింది. బిసి రిజర్వేషన్ల వ్యవహారంతో ఆగిపోయిన స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. డిసెంబర్ రెండో వారంలో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ ఉంటుందని పేర్కొంది. ప్రజాపాలన వారోత్సవాల తర్వాతే లోకల్ బాడీ ఎలక్షన్స్ ఉంటాయని మంత్రివర్గ భేటీ స్పష్టం చేసింది. డిసెంబర్ 1 నుంచి 9 వరకు ..మిగతా 2లో



## గిగ్ వర్కర్లకు ఇక రక్షణ కవచం

వెట్టినుంచి విముక్తితో పాటు ఉద్యోగ భద్రత
సంక్షేమం, సామాజిక భద్రత లక్ష్యంగా బిల్లు
చర్చించి ఆమోదిరచిన తెలంగాణ కేబినేట్




02



# సౌదీ అరేబియాలో ఘోర ప్రమాదం

### సౌదీ అరేబియాలో భారత యాత్రికుల బస్సుకు ప్రమాదం

### 45 మంది భారత యాత్రికుల సజీవ దహనం

డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొనడంతో జరిగిన ప్రమాదం
మక్కా నుంచి మదీనా వెళ్తుండగా ఈ దుర్ఘటన
28మంది మహిళలు...
17మంది పురుషులు
ఒకే కుటుంబంలో 18మంది మృతి
ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన ప్రభుత్వం

**హైదరాబాద్, నవంబర్ 17(ప్రజాస్వరం)**

సౌదీ అరేబియాలో ఘోర ప్రమాదం జరిగింది. హజ్ యాత్రికులతో వెళుతున్న బస్సును డీజిల్ ట్యాంకర్ ఢీకొట్టటంతో 45మంది సజీవ దహనమయ్యారు. మృతులందరూ హైదరాబాదీలు కావటంతో ఇక్కడ తీవ్ర విషాదం నెలకొంది. ప్రతీ ఏటా పవిత్ర మక్కా...మదీనా ..మిగతా 2లో

## సౌదీ ప్రమాద ఘటనపై సీఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి..

భారత యాత్రికుల బస్సుకు ఘోర ప్రమాదం

డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొట్టడంతో 45 మంది సజీవ దహనం
మృతుల్లో హైదరాబాద్ మల్లేపల్లికి చెందిన 16 మంది ఉన్నట్లు సమాచారం
ఘటనపై స్పందించిన సీఎం రేవంత్.. సహాయక చర్యలకు ఆదేశం

02


# షేక్ హసీనాకు ఉరిశిక్ష

గత ఏడాది జరిగిన అల్లర్ల కేసులో షేక్ హసీనాకు మరణశిక్ష
అల్లర్లలో కాల్పులకు ఆదేశించారన్న అభియోగం
చట్టానికి ఎవరు అతీతులు కాదన్న యూనస్
తీర్పు వెలువడిన సమయంలో చప్పట్లతో మార్మోగిన హాలు
ఢాకా ట్రైబ్యునల్ కోర్టు సంచలన తీర్పు



**ఢాకా, నవంబర్ 17(ప్రజాస్వరం)**

ఢాకా అల్లర్లకు కారణమంటూ బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు అక్కడి కోరటు ఉరిశిక్ష విధించింది. దశాబ్దాల పాటు ఆ దేశ రాజకీయ ..మిగతా 2లో



# బీఆర్ఎస్ vs కవిత

### కవిత మాటల దాడిని ఇన్నాళ్ళు లైట్ తీసుకున్న బీఆర్ఎస్

ఇప్పుడు చేయి దాటిపోతోందని భావిస్తున్నారా?
కర్మ హిట్స్ బ్యాక్ మెసేజ్‌తో పార్టీ పెద్దలకు కాలిపోయిందా?
ఇక ఉపేక్షిస్తే లాభం లేదని డిసైడయ్యారా?
అటాక్ మోడ్ ఆన్ చేయమని తెలంగాణ భవన్ నుంచి సంకేతాలు?
కవిత విషయంలో ఇక దూకుడు పెరుగుతుందా?
ఇక మీదట మాటల యుద్ధం తీవ్ర రూపం దాల్చబోతోందా?

**హైదరాబాద్, నవంబర్ 17(ప్రజాస్వరం)**

ఎమ్మెల్సీ కవిత వ్యవహారశైలి బీఆర్ఎస్‌కు అస్సలు మింగుడు పడటం లేదట. పార్టీ నుంచి సస్పెండ్ అయ్యాక కొన్నాళ్ళు కామ్‌గా ఉన్నా... ఇటీవల తీవ్ర స్థాయిలో మాటల దాడి చేస్తున్నారామె. దాన్ని కూడా పార్టీ పెద్దలు చూసీ చూడనట్టు వదిలేసినా... ఇక ఇప్పుడు పరిస్థితి చేయి దాటిపోతోందని భావిస్తున్నారట. గిల్లి, గిచ్చి, సూదులతో గుచ్చినట్టుగా కవిత మాటలు ఉండటంతో పాటు.. ..మిగతా 2లో



## స్పీకర్ తీరును తప్పుపట్టిన సుప్రీం

పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్ల విచారణ
నిర్ణయం తీసుకునేందుకు స్పీకర్‌కు మరో 4 వారాల గడువు
గతంలో ఇచ్చిన గడువు ముగిసిందని సుప్రీంకోర్టులో బీఆర్ఎస్ పిటిషన్
ప్రక్రియ ప్రారంభించానని, సమయం కావాలని కోరిన స్పీకర్
ఇరుపక్షాల పిటిషన్లపై విచారణ 4 వారాలకువాయిదా

**హైదరాబాద్, నవంబర్ 17(ప్రజాస్వరం)**

తెలంగాణ స్పీకర్ తీరుపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎమ్మెల్యేల అనర్హతపై మీరు నిర్ణయం తీసుకుంటారా? మేము తీసుకోవాలా ? అని సుప్రీంకోర్టు తెలంగాణ స్పీకర్‌ను ..మిగతా 3లో

# సిజెఐ మీద జరిగిన దాడి 30 కోట్ల దళితుల మీద జరిగిన దాడి

విశ్వాసాల ముసుగులో దాడులకు పాల్పడే వారికి గుణపాఠం చెప్తాం
న్యాయ, పోలీసు వ్యవస్థ, మానవ హక్కుల కమిషన్ వివక్షతను పాటించాయి
రాజ్యాంగాన్ని తొలగించి, మను ధర్మాన్ని రుద్దాలని చూసేవారు మాకు శత్రువులే
దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయాలని చూస్తే తగిన గుణపాఠం చెప్తాం
ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ




03

## తెలంగాణలోనూ ఓటు తొలగింపు కుట్ర

బిహార్‌లో దొడ్డిదారిన ఎన్డీఏ విజయం
ఓటు శాతం తక్కువగా వచ్చినా.. ఎన్డీయే సీట్లు గెలవడం వెనక ఆంతర్యం ఏంటి..?
పీసీసీ చీఫ్ మహేశ్ సంచలన ఆరోపణ



03

## కుంగిపోవద్దు, భవిష్యత్తు మనదే..

అభ్యర్థిని ఆలస్యంగా ప్రకటించినందువల్లే ఓడిపోయామన్న ఈటల
ఉప ఎన్నికల్లో అధికార పార్టీ గెలవడం సహజమే
ఉప ఎన్నికల్లో ఓడినంత మాత్రాన బీజేపీ పని అయిపోయినట్లు కాదని వ్యాఖ్య
కాంగ్రెస్ డిపాజిట్లు కోల్పోయినప్పటికీ అధికారంలోకి వచ్చిందని వ్యాఖ్య



03

# షేక్ హసీనాకు ఉరిశిక్ష

**మొదటిపేజీ తరువాయి**



చరిత్రను తానై నడిపించిన ఆమెను 'ఉక్కు మహిళ'గా వ్యవహరిస్తుంటారు. కానీ, తన హయాంలో ఏర్పడ్డ ట్రైబ్యునలే.. ఇప్పుడు ఆమెకు మరణశిక్ష విధించింది. ఇటీవలి అల్లర్ల తరవాత ఆమె భారత్‌లో ఆశ్రయం పొంది ప్రవాస జీవితం గడుపుతున్నారు.

ఆమె ప్రభుత్వం అసమ్మతిని అణచివేసిందని, మీడియాపై ఆంక్షలు విధించిందని, ప్రతిపక్ష నాయకులను అరెస్టు చేసిందని, భద్రతా శక్తుల అధికారాలను పెంచిందనే ఆరోపణలు వచ్చాయి. 2024లో స్వాతంత్య్ర పోరాట వీరుల పిల్లలకు ప్రభుత్వ ఉద్యోగాల్లో కోటాకు వ్యతిరేకంగా మొదలైన విద్యార్థి నిరసనలు చివరికి దేశవ్యాప్త తిరుగుబాటుగా మారాయి. ఈ నిరసనలే హసీనా పాలనను అంతం చేశాయి. ఆమె ప్రభుత్వం చేపట్టిన భద్రతా చర్యల వల్ల హింస పెరిగింది. ఇది జులై తిరుగుబాటుగా మారింది. ఈ అల్లర్లలో 1,400 మంది వరకు మరణించారని ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల కార్యాలయం నివేదించింది. ఆందోళనల కారణంగా హసీనా అధికారం నుంచి వైదొలగి భారత్‌లో ఆశ్రయం పొందాల్సి వచ్చింది. అనంతరం బంగ్లాలో మహ్మద్ యూనస్ నేతృత్వంలో ఏర్పడ్డ మధ్యంతర ప్రభుత్వం 'అంతర్జాతీయ నేరాల ట్రైబ్యునల్ 'ను పునరుద్ధరించింది. యుద్ధ నేరాలకు పాల్పడిన వారిని విచారించేందుకు ఆమే ఒకప్పుడు దీన్ని ఏర్పాటు చేసింది. ఇప్పుడు అదే ట్రైబ్యునల్ 2024 నాటి అల్లర్ల విషయంలో హసీనాపై మానవత్వానికి వ్యతిరేకంగా చేసిన నేరాల ఆరోపణలు మోపింది. నెలల తరబడి విచారణ జరిపి సోమవారం మరణశిక్ష విధించింది. తన ఎదుగుదలకు తోడ్పడిన దేశమే ఇప్పుడు తన పతనాన్ని శాసించడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు హసీనా. భారత ఆశ్రయంలో ఉంటూ సరిహద్దు ఆవల ఉన్న బంగ్లాదేశ్ భవిష్యత్తుపై మథనపడుతున్నారు. తనకు విధించిన మరణ శిక్షను ఖండిరచారు. తీర్పు మోసపూరితమన్నారు. అక్కడి ప్రభుత్వమే కుట్రపూరితంగా తనకు శిక్ష పడేలా చేసిందని ఆవేదన చెందారు. తనను తాను నిరూపించుకోవడానికి కోర్టు అవకాశం ఇవ్వలేదని వాపోయారు. నాటి తూర్పు పాకిస్థాన్‌లోని తుంగిపారాలో 1947 సెప్టెంబరు 28న షేక్ హసీనా జన్మించారు. తండ్రి షేక్ ముజిబుర్ రెహమాన్ ఆ దేశ స్వాతంత్య్ర పోరాటంలో కీలకంగా వ్యవహరించి జాతిపితగా నిలిచిపోయారు. ఢాకా విశ్వవిద్యాలయం నుంచి బెంగాలీ సాహిత్యంలో హసీనా మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేశారు. ఆ సమయం లోనే విద్యార్థి రాజకీయాల్లో చురుగ్గా పాల్గొన్నారు. 1968లో అణు శాస్త్రవేత్త ఎం.ఎ.వాజెద్ మియాను వివాహం చేసుకున్నారు. రాజకీయాలకు భిన్నంగా ఆయన విద్యావేత్తగా నిరాడంబర జీవితం గడిపారు. 2009లో ఆయన మరణించే వరకు ఆమెకు తోడుగా ఉన్నారు. వారికి సజీబ్ వాజెద్ జాయ్ అనే కొడుకు, సైమా వాజెద్ పుతుల్ అనే కూతురు ఉన్నారు. 1975 ఆగస్టులో జరిగిన సైనిక తిరుగుబాటు హసీనా జీవితాన్ని పూర్తిగా మార్చేసింది. ఆ ఘర్షణల్లో ఆమె తండ్రి, తల్లి, ముగ్గురు సోదరులు ఇంకా కుటుంబ సభ్యులు హత్యకు గురయ్యారు. ఆ సమయంలో విదేశాల్లో ఉండటం వల్ల హసీనా, ఆమె చిన్న చెల్లెలు రెహానా మాత్రమే బతికి బయటపడ్డారు. నాటి భారత ప్రధాని ఇందిరా గాంధీ ఆమెకు ఆశ్రయం ఇచ్చారు. ఆరు సంవత్సరాల తర్వాత 1981 మేలో బంగ్లాదేశ్‌కు హసీనా తిరిగొచ్చారు. దేశానికి రాకముందే ఆమెను అవామీ లీగ్ పార్టీ తమ ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకుంది. దేశానికి తిరిగి వచ్చే సరికే హసీనా ప్రధాన ప్రత్యర్థి ఖలీదా జియా ఆమె కోసం వేచి చూస్తున్నారు. హత్యకు గురైన అధ్యక్షుడు జియావుర్ రెహమాన్ భార్యే ఈ ఖలీదా. వీరిద్దరే తమదైన సిద్ధాంతాలు, పోరాటాలతో మూడు దశాబ్దాల పాటు బంగ్లాదేశ్ రాజకీయ చరిత్రను రచించారు. హసీనా మొదటిసారి 1996లో ప్రధానిగా బాధ్యతలు స్వీకరించారు. 2001లో అధికారం కోల్పోయారు. 2008లో భారీ విజయం సాధించి సుదీర్ఘ పాలన మొదలుపెట్టారు. 2014, 2018 ఎన్నికల్లోనూ అవామీ లీగ్ పార్టీయే గెలిచింది. దీంతో ప్రపంచంలోనే ఎక్కువ కాలం పాలించిన మహిళా నేతల్లో ఒకరిగా చరిత్ర సృష్టించారు. ఆమె పాలనలో బంగ్లాదేశ్ చాలా వేగంగా ఆర్థిక వృద్ధిని సాధించింది. పద్మా వంతెన వంటి ముఖ్యమైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు పూర్తయ్యాయి. పేదరిక నిర్మూలనలో దేశం పురోగమించింది. బంగ్లాదేశ్ ప్రపంచ వస్త్ర పరిశ్రమకు కేంద్రంగా మారింది. ఈ ప్రశంసలతో పాటే విమర్శలు కూడా ఎదుర్కొన్నారు.

# సౌదీ అరేబియాలో ఘోర ప్రమాదం..

**మొదటిపేజీ తరువాయి**

యాత్రకు హైదరాబాద్ నుంచి పెద్ద సంఖ్యలో మహిళలు, పురుషులు తమ తమ పిల్లలతో కలిసి వెళ్లే విషయం తెలిసిందే. ఇలాగే నవంబర్ 9న విద్యానగర్, బజార్ ఘాట్, మల్లేపల్లి తదితర ప్రాంతాలకు చెందిన 54మంది అల్ మక్కా, బాబ్ ఉల్ హర్మైన్, హప్సా, మహమూద్ భాయ్ జాన్ ట్రావెల్స్ నుంచి మక్కా యాత్రకు బయల్దేరి వెళ్లారు. వీరిలో 28మంది మహిళలు, 17మంది పురుషులతోపాటు పిల్లలు కూడా ఉన్నారు. తొలుత జెద్దాకు చేరుకున్న యాత్రికుల బృందం ఆ తరువాత మక్కా వెళ్లింది. అక్కడ ప్రార్థనలు ముగించుకున్న అనంతరం 4గురు మక్కాలోనే ఉండిపోగా మరో నలుగురు కారులో మదీనాకు బయల్దేరి వెళ్లారు. మిగితా 46మంది బస్సులో ప్రయాణమయ్యారు. మదీనాకు 25 కిలోమీటర్ల దూరంలోని ముఫరహత్ ప్రాంతంలో తెల్లవారుఝాము 1.30గంటల సమయంలో వేగంగా దూసుకొచ్చిన డీజిల్ ట్యాంకర్ బస్సును ఢీకొట్టింది. ఆ సమయంలో బస్సులో ఉన్న యాత్రికులందరూ గాఢనిద్రలో ఉన్నారు. ప్రమాదంలో ట్యాంకర లోని డీజిల్ లీక్ కావటం...నిప్పురవ్వలు అంటుకుని క్షణాల్లోనే అగ్నికీలలు బస్సును కబళించేయటంతో 46మంది యాత్రికుల్లో షోయబ్ అనే వ్యక్తి మినహా మిగితా వారంతా సజీవ దహనమయ్యారు.



**కుటుంబం మొత్తం ఛిన్నాభిన్నం...**

జరిగిన ఘోర ప్రమాదంలో విద్యానగర్ కు చెందిన ఓ కుటుంబంలోని 18మంది మృత్యువాత పడ్డారు. ప్రస్తుతం ఈ కుటుంబంలో ఒకే ఒక్క వ్యక్తి ప్రాణాలతో ఉన్నాడు. విద్యానగర్ నివాసి నసీరుద్దీన్ రైల్వేలో పని చేసి రిటైరయ్యారు. మక్కా మదీనా యాతరకు తన కుమారులు, కూతుళ్లు, కోడళ్లు, వారి పిల్లలతో సహా మొత్తం 18మందితో కలిసి ప్రయాణమయ్యారు. బస్సును డీజిల్ ట్యాంకర్ ఢీకొట్టటంతో ఎగిసిన మంటల్లో ఈ కుటుంబానికి చెందిన నసీరుద్దీన్, ఉమ్మేజా, మరియం ఫాతిమా షేక్ జైనుద్దీన్, మెహరీష్, మహ్మద్, రిదాతజీన్, ఉజైరుద్దీన్, అక్బర్ బేగం, అసిన్ ఫాతిమా, అమీనా బేగం, సారా బేగం, సబానా బేగం, సుబేషా జాఫర్, రిజ్వానా బేగం, సలావుద్దీన, ఫర్హానా సుల్తానా, తసీమా తస్రీన్ చనిపోయారు.

**మరో కుటుంబంలో 7మంది...**


ఇక, బజార్ ఘాట్ కు చెందిన మరో కుటుంబంలో 8మంది ప్రమాదంలో కన్నుమూశారు. ఈ కుటుంబంలో ఒక్క మహ్మద్ అబ్దుల్ షోయబ్ గాయాలతో బతికి బయటపడ్డాడు. ప్రస్తుతం అతనికి ఆస్పత్రిలో చికిత్స జరుగుతోంది. దుర్ఘటనలో షోయబ్ తండ్రి మహ్మద్ అబ్దుల్ ఖదీర్, తల్లి గౌసియా బేగం, మహ్మద్ మౌలానా, రహీమ్ ఉన్నీసా, రహమత్ బీ, మహ్మద్ మన్సూర్ తోపాటు మరొకరు సజీవ దహనమయ్యారు.

**8మంది మాత్రమే క్షేమం...జాయింట్ సీపీ**

జరిగిన ప్రమాదంపై హైదరాబాద్ జాయింట్ కమిషనర్ తఫ్సీర్ ఇక్బాల్ మాట్లాడుతూ జరిగిన ఘోర ప్రమాదంలో 45మంది సజీవ దహనమైనట్టు చెప్పారు. ప్రాణాలతో బయటపడ్డ షోయబ్ కు చికిత్స జరుగుతోందన్నారు. అయితే, అతని ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందన్నది తెలియరాలేదని చెప్పారు. సౌదీలోని ఇండియన్ ఎంబసీ నుంచి సిబ్బంది ప్రమాద స్థలానికి వెళ్లి సహాయక చర్యలు చేపట్టినట్టు తెలిపారు. మక్కా యాత్రకు వెళ్లిన వారిలో 8మంది మాత్రమే సురక్షితంగా ఉన్నట్టు చెప్పారు. యాత్రికుల్లో నలుగురు మక్కాలోనే ఉండిపోవటం...మరో నలుగురు కారులో మదీనాకు వెళ్లటంతో ప్రమాదం నుంచి తప్పించుకున్నారన్నారు. ప్రమాదానికి గురైన బస్సు సౌదీ రవాణ శాఖకు చెందినదని తెలిపారు.

# బీఆర్ఎస్ vs కవిత

**మొదటిపేజీ తరువాయి**




ఇతర పార్టీలకు ఆయుధం ఇచ్చేలా ఉంటున్నట్టు పెద్దలు ఫీలవుతున్నట్టు తెలుస్తోంది. జాగృతి జనం బాట పేరుతో ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్త పర్యటన చేస్తున్న కవిత___. అవకాశం వచ్చినప్పుడల్లా బీఆర్ఎస్‌ని టార్గెట్ చేస్తున్నారు. అవన్నీ ఒక ఎత్తయితే___ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో పార్టీ ఓడిపోయాక కు పుండు మీద కారం చల్లినట్టు ఎక్స్ మెసేజ్ పెట్టారామె. కర్మ హిట్స్ బ్యాక్ అంటూ___. ఎవరు చేసిన కర్మ వారికే తిరిగి కొడుతుందన్న అర్థం వచ్చేలా ఆమె పెట్టిన పోస్ట్ వైరల్ అయింది. ఎద్దు పుండును కాకి పొడిచినట్టుగా ఉందన్న అభిప్రాయాలు సైతం వ్యక్తం చేశారు ఆ ట్వీట్ చూసిన కొందరు.

ఆ తర్వాత పార్టీలోని సీనియర్ నేతలను తీవ్రస్థాయిలో విమర్శించారామె. హరీష్‌రావు సహా___ కేసీఆర్‌కు సన్నిహితంగా ఉండే మాజీ మంత్రులను తీవ్రస్థాయిలో విమర్శించారు కవిత. దీంతో.. ఇంకా ఉపేక్షిస్తే లాభం లేదని పార్టీ పెద్దలు డిసైడైనట్టు తెలుస్తోంది. ఇలాగే వదిలేస్తే___ మిగతా పార్టీలకంటే___ కవిత చేసే డ్యామేజే ఎక్కువగా ఉందని భావిస్తున్నారట. ఆమె విషయంలో ఇక ఆగాల్సిన అవసరం లేదు, అటాక్ మోడ్ ఆన్ చేయండని బీఆర్ఎస్ భవన్ నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చేసినట్టు చెప్పుకుంటున్నారు. మొన్నటిదాకా అధినేత కూతురుగా, బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు ఆమెతో ఉన్న అనుబంధం లాంటి రకరకాల కారణాలతో కవితపై మాట్లాడ్డానికి చాలామంది వెనుకంజ వేశారు. కానీ ఇప్పుడు డైరెక్ట్ గా అధిష్టానం నుంచే క్లియరెన్స్ రావడంతో___పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇక దూకుడు పెంచుతున్నారట. తాజాగా వాళ్ళు చేసిన వ్యాఖ్యలే మారిన వైఖరికి నిదర్శనం అంటున్నారు. ఇన్నాళ్లు కవిత ఏం మాట్లాడినా___ ఆచితూచి స్పందించే నాయకులు తాజాగా మాత్రం కారణజన్ముడి కడుపున రాక్షసి పుట్టిందంటూ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇక ముందు ముందు ఈ మాటల ఘాటు మరింత పెరుగుతుందని కూడా చెబుతున్నాయి బీఆర్ఎస్ వర్గాలు. ఆమె అంటున్న మాటలు పార్టీని ఆ స్థాయిలో డ్యామేజ్ చేస్తున్నాయి కాబట్టి ఇక రివర్స్ అటాక్ తప్పదని గులాబీ పెద్దలు నిర్ధారణకు వచ్చినట్టు తెలిసింది. కవిత పార్టీ నుంచి బయటికి పోవడం వల్ల పెద్దగా నష్టం జరగలేదుగానీ___ వెళ్ళాక చేస్తున్న విమర్శలు, ఆరోపణలు మాత్రం బీఆర్ఎస్ అధిష్టానానికి శూలాల్లా గుచ్చుకుంటూ గాయాలు చేస్తున్నాయన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది రాజకీయవర్గాల్లో. పరిస్థితి తీవ్రంగా ఉంది కాబట్టి___ ఇక ఎట్టి పరిస్థితుల్లో కవితను వదిలిపెట్టకూడదని డిసైడైనట్టు చెప్పుకుంటున్నారు. కవిత తన తండ్రి కేసీఆర్‌కు లేఖ రాసినప్పుడే కొంతమంది మాట్లాడ్డానికి ప్రయత్నిస్తే అడ్డు చెప్పింది అధిష్టానం. ఆ తర్వాత కూడా కవిత పార్టీలోని కీలక నేతలపై విమర్శలు చేసినప్పుడు కూడా సైలెన్స్ సైలెన్స్ అంది. కానీ___ ఇక ఇప్పుడు అట్నుంచి దాడి తీవ్రత పెరిగిపోవడంతో___ సమాధానం చెప్పకుండా ఉపేక్షిస్తే.. డ్యామేజ్ పెరిగిపోతుందని భావిస్తున్నారట బీఆర్ఎస్ పెద్దలు. అందుకే మీ ఇష్టం___ మాట్లాడుకోండని నాయకులకు గ్రీన్ సిగల్ సిగ్నల్ ఇచ్చేసినట్టు సమాచారం. బీఆర్ఎస్ వర్సెస్ కవిత మాటల యుద్ధం ముందు ముందు ఇంకెంత హాట్ హాట్‌గా జరుగుతుందో చూడాలి.

# గిగ్ వర్కర్లకు ఇక రక్షణ కవచం

- **వెట్టినుంచి విముక్తితో పాటు ఉద్యోగ భద్రత**
- **సంక్షేమం, సామాజిక భద్రత లక్ష్యంగా బిల్లు**
- **చర్చించి ఆమోడిరచిన తెలంగాణ కేబినేట్**

**హైదరాబాద్, నవంబర్ 17(ప్రజాస్వరం)**

తెలంగాణ గిగ్ వర్కర్స్ బిల్లుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. సోమవారం సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో మంత్రి మండలి సమావేశం జరిగింది. ఈ భేటీలో 'తెలంగాణ ప్లాట్‌ఫామ్ `ఆధారిత గిగ్ వర్కర్ల రిజిస్ట్రేషన్, సామాజిక భద్రత, సంక్షేమం బిల్లు`2025'పై చర్చించిన అనంతరం బిల్లుకు కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. గిగ్ వర్కర్ల సంక్షేమం, సామాజిక భద్రత లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ బిల్లును రూపొందించింది. కేబినెట్ ఆమోదం పొందిన ఈ బిల్లు చట్టరూపం దాలిస్తే దేశంలోనే తొలిసారిగా సమగ్ర గిగ్ వర్కర్ల చట్టం తెచ్చిన తొలి రాష్ట్రంగా తెలంగాణ అవతరిస్తుంది. ఇకపై గిగ్ వర్కర్లను రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రామిక వర్గంగా గుర్తిస్తుంది. ప్రస్తుతం రాష్ట్రంలో దాదాపు 3 లక్షల నుంచి 4 లక్షల వరకు గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్లు ఉన్నారు. వీరిలో ఎక్కువ శాతం రవాణా (మొబిలిటీ), డెలివరీ, లాజిస్టిక్స్ రంగాల్లో పని చేస్తున్నారు. వీరు సాధారణంగా వారానికి 7 రోజుల పాటు రోజుకు 10 నుంచి`12 గంటల చొప్పున వర్క్ చేస్తున్నారు. వీరి ఆదాయంలో ప్లాట్‌ఫామ్‌లు 20 నుంచి 30శాతం వరకు కమిషన్‌గా వసూలు చేస్తున్నాయి. ఈ క్రమంలో వారికి స్థిరమైన ఆదాయం, సామాజిక భద్రత లేకుండాపోవడం ప్రధాన సమస్యగా ఉంది. తాజా బిల్లులో గిగ్ వర్కర్ల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్ కేంద్రంగా 'తెలంగాణ ప్లాట్‌ఫామ్ `ఆధారిత గిగ్ వర్కర్ల సామాజిక భద్రత, సంక్షేమ బోర్డు' పేరుతో ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయనుంది. ఈ బోర్డు గిగ్ వర్కర్ల రిజిస్ట్రేషన్, సంక్షేమ పథకాల అమలు, నిధుల పర్యవేక్షణ బాధ్యతలు చేపడుతుంది. అగ్రిగేటర్లకు చెల్లించే సొమ్ములో 1`2 శాతం వాటాను గిగ్ వర్కర్ల సంక్షేమ నిధికి మళ్లించనున్నారు. దీనికి తోడు ప్రభుత్వం తరఫున సీఎస్ఆర్ ఫండ్స్, విరాళాలు, గ్రాంట్లను ఈ నిధికి అందజేస్తుంది. ప్లాట్‌ఫామ్‌ల చెల్లింపులు సక్రమంగా జరుగుతున్నాయా? లేదా? అనేది పర్యవేక్షించేందుకు రియల్`టైమ్ 'వెల్ఫేర్ ఫండ్ ఫీ వెరిఫికేషన్ సిస్టమ్ అందుబాటులోకి తేనున్నారు. స్విగ్గీ, జొమాటో, జెప్టో, ఉబర్, ఓలా వంటి ప్లాట్ ఫామ్‌లు, కార్మికుల మధ్య తలెత్తే వివాదాలను ఇన్‌టైంలో పరిష్కరించేందుకు వీలుగా ప్రభుత్వం ప్రత్యేక గ్రీవెన్స్ రిడ్రెసల్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని ముసాయిదాలో పొందుపరిచింది. ఇందులో భాగంగా గిగ్ కార్మికుల జీతాల చెల్లింపులో ఆలస్యం, మోసాలు, అకారణంగా అకౌంట్లు సస్పెండ్? చేయడం.. లాంటి సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్ రిడ్రెసల్ అధికారులను నియమిస్తారు. 100 మందికి పైగా కార్మికులు ఉండే ప్రతి పెద్ద ఎలాట్‌ఫామ్‌లో 'అంతర్గత వివాద పరిష్కార కమిటీ'ని తప్పనిసరిగా ఏర్పాటుచేయాల్సి ఉంటుంది. ఈ కమిటీల ద్వారా పరిష్కారం లభించకపోతే, పైస్థాయిలో అప్పీలేట్ అథారిటీకి వెళ్లే అవకాశం ఉంటుంది. ఇందుకోసం బిల్లులో ప్రత్యేక నిబంధనలు పొందుపరిచారు. కార్మికులు లేదా లాట్‌ఫామ్‌లు గ్రీవెన్స్ అధికారులు ఇచ్చిన నిర్ణయంపై సంతృప్తిచెందకపోతే వారు అప్పీలేట్ అథారిటీని ఆశ్రయించే అవకాశం ఉంది. ఈ అథారిటీ స్వతంత్రంగా విచారణ జరిపి తుది నిర్ణయం తీసుకోనుంది. తద్వారా కార్మికులకు న్యాయపరమైన భరోసా దక్కుతుంది. చట్టం అమల్లోకి వస్తే ఆయా ప్లాట్‌ఫామ్‌లు ఇకపై ఉద్యోగులను అకారణంగా తొలగించలేవు. ఎవరైనా ఉద్యోగిని తొలగించాలంటే కనీసం ఏడు రోజుల ముందు నోటీసు ఇవ్వడం తప్పనిసరి. గతంలో ప్లాట్‌ఫామ్‌లు గిగ్ వర్కర్ల అకౌంట్లను ఒక్కసారిగా నిలిపివేసేవి. దీనివల్ల కార్మికులు ఉన్నఫళంగా రోడ్డునపడేవారు. తాజా బిల్లులో కస్టమర్ భద్రతకు ముప్పు కాని సందర్భాల్లో.. ఏ వర్కర్‌నైనా తొలగించాలంటే కనీసం ఏడు రోజుల ముందుగా నోటీసు ఇవ్వాలనే నిబంధన పెట్టారు. పని కేటాయింపు, తొలగింపు.. తదితర అంశాల్లో వివక్ష లేకుండా ఉండేందుకు, ప్లాట్‌ఫామ్‌లు ఉపయోగిస్తున్న అల్గారిథమ్‌లు పారదర్శకంగా ఉండేలా చూడాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం గిగ్ వర్కర్లకు పని కేటాయింపులు, బోనస్‌లు, రేటింగ్‌లు, అకౌంట్ సస్పెన్షన్‌లు పూర్తిగా సాఫ్ట్‌వేర్ అల్గారిథమ్‌పై ఆధారపడి నడుస్తున్నాయి. వీటిలో వివక్ష, అన్యాయానికి తావులేకుండా బిల్లులో 'అల్గారిథమ్ ట్రాన్సపరెన్సీ'ని తప్పనిసరి చేస్తున్నారు. దీని ద్వారా కార్మికులు తమ పనిపై ప్రభావం చూపే నిర్ణయాలు ఎలా తీసుకుంటున్నారో తెలుసుకునే హక్కు పొందుతారు. గిగ్‌వర్కర్ల బిల్లు రూపకల్పన నుంచి ఆమోదం వరకు ప్రభుత్వం శాస్త్రీయంగా ముందుకు వెళ్తున్నది. ముందుగా రాష్ట్రంలో 1,300 మంది గిగ్ వర్కర్లపై సర్వే నిర్వహించి, వారు ఎదుర్కొంటున్న సమస్యల ఆధారంగా బిల్లులో పలు అంశాలు పొందుపరిచింది. 2024 జనవరి నుంచి 2025 జూన్ వరకు అగ్రిగేటర్లు, గిగ్ వర్కర్ల సంఘాలు, నిపుణులు, న్యాయవేత్తలతో ఆరుసార్లు సంప్రదింపులు చేపట్టి.. పలు మార్పులు చేర్పులు చేసింది.


న్యాయశాఖ పరిశీలన అనంతరం ఈ ఏడాది ఏప్రిల్ 14 నుంచి మే 19 వరకు బిల్లుపై ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టింది. 66 సూచనలు, అభ్యంతరాలు అందగా.. వీటిలో చాలా అంశాలను బిల్లులో పొందుపరిచారు.

# వచ్చే నెలలో స్థానిక ఎన్నికలు

**మొదటిపేజీ తరువాయి**

తెలంగాణ ప్రజాపాలన వారోత్సవాలు జరగనున్నాయి. వారోత్సవాల సమయంలో ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కేబినెట్ నిర్ణయించింది. స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా సర్పంచ్ సహా జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. అయితే ముందుగా సర్పంచ్ ఎన్నికలు నిర్వహించాలని కేబినెట్ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. సర్పంచ్ ఎన్నికల తరవాతే జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు నిర్వహించాలని మంత్రివర్గ భేటీలో చర్చించినట్లు సమాచారం. జూబ్లీహిల్స్ ఎన్నికల ఫలితంనే లోకల్ బాడీ ఎలక్షన్‌లలో పునరావృతం చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తోంది. ఇక తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల పదవీకాలం ముగిసి 20 నెలలు పూర్తయ్యాయి. ఇటీవల బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశం తీవ్ర వివాదాస్పదమైంది. దీనిపై హైకోర్టు, సుప్రీం కోర్టు వ్యతిరేకంగా తీర్పు నిచ్చాయి. రిజర్వేషన్లు 50శాతం దాటరాదన్న నిబంధనలను పాటించాలని సూచించాయి. మొత్తానికి డిసెంబర్‌లో ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల కానుంది. సిఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన సోమవారం నాడు రాష్ట్ర సచివాలయంలో మంత్రివర్గం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అనేక అంశాలపై చర్చించారు. ముఖ్యంగా స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై చర్చించినట్లు సమాచారం.

ఇప్పటికే ఎన్నికల నిర్వహణ ఆలస్యమైన నేపథ్యంలో ఇక ఆలస్యం చేయొద్దని.. వీలైనంత తర్వగా లోకల్ బాడీ ఎలక్షన్స్ నిర్వహించాలని నిర్ణయించింది మంత్రివర్గం. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు అవుతున్న నేపథ్యంలో తమ ప్రభుత్వం ప్రజల కోసం ఏం చేసిందనే విషయాన్ని ప్రజాపాలన వారోత్సవాల్లో వివరించాలని మంత్రివర్గం తీర్మానించింది. గ్రామ స్థాయిలో ప్రభుత్వ పథకాలు, ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను ప్రచారం చేసి.. లోక్‌బాడీ ఎన్నికల్లో జయకేతనం ఎగురవేయాలని నిర్ణయించింది. ప్రజాపాలన వారోత్సవాలతో గ్రామ స్థాయి కేడర్‌లో మరింత ఉత్సాహం నింపి స్థానిక ఎన్నికల్లో విజయ ఢంకా మోగించాలని భావిస్తున్నారు.



# సౌదీ ప్రమాద ఘటనపై సీఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి..

- **సౌదీ అరేబియాలో భారత యాత్రికుల బస్సుకు ఘోర ప్రమాదం**
- **డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొట్టడంతో 45మంది సజీవ దహనం**
- **మృతుల్లో హైదరాబాద్ మల్లేపల్లికి చెందిన 16 మంది ఉన్నట్లు సమాచారం**
- **ఘటనపై స్పందించిన సీఎం రేవంత్.. సహాయక చర్యలకు ఆదేశం**

**హైదరాబాద్, నవంబర్ 17(ప్రజాస్వరం)**

సౌదీ అరేబియాలో జరిగిన ఘోర బస్సు ప్రమాదంలో 42 మంది భారత యాత్రికులు సజీవ దహనమైన విషయం తెలిసిందే. ఉమ్రా యాత్ర ముగించుకుని మక్కా నుంచి మదీనాకు వెళుతున్న బస్సు, బదర్ మదీనా మధ్యలోని ముఫరహత్ ప్రాంతంలో సోమవారం తెల్లవారుజామున 1:30 గంటలకు డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సుకు మంటలు అంటుకోవడంతో అందులో ఉన్న యాత్రికులు సజీవ దహనమయ్యారని ఇంగ్లిష్ మీడియా కథనాలు వెల్లడించాయి. మృతుల్లో 20 మంది మహిళలు, 11 మంది చిన్నారులు ఉన్నట్లు సమాచారం. ఈ దుర్ఘటనపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంపై పూర్తి వివరాలు తెలుసుకోవాలని, కేంద్ర, సౌదీ ఎంబసీ అధికారులతో సమన్వయం చేసుకుని తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. బాధితుల కుటుంబాలకు అండగా నిలిచేందుకు సచివాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సహాయం కోసం 79979 59754, 99129 19545 నంబర్లలో సంప్రదించాలని అధికారులు సూచించారు. మృతుల్లో హైదరాబాద్‌లోని మల్లేపల్లి బజార్ ఘాట్‌కు చెందిన 16 మంది యాత్రికులు ఉన్నట్లు తెలుస్తోంది. వీరంతా ఉమ్రా ట్రావెల్స్ ద్వారా యాత్రకు వెళ్లినట్లు ప్రాథమిక సమాచారం. ఈ వార్త తెలియడంతో వారి కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది.



# సిజెఐ మీద జరిగిన దాడి 30 కోట్ల దళితుల మీద జరిగిన దాడి

- 'విశ్వాసాల ముసుగులో దాడులకు పాల్పడే వారికి గుణపాఠం చెప్తాం
- న్యాయవ్యవస్థ, పోలీసు వ్యవస్థ, మానవ హక్కుల కమిషన్ వివక్షతను పాటించాయి.
- రాజ్యాంగాన్ని తొలగించి, మను ధర్మాన్ని రుద్దాలని చూసే వారెవరైనా మాకు శత్రువులే.
- దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయాలని చూస్తే తగిన గుణపాఠం చెప్తాం.
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ







**నేషనల్ బ్యూరో నవంబర్ 17(ప్రజాస్వరం):**

సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయి మీద జరిగిన దాడి.. దేశంలోని ముప్పై కోట్ల మంది దళిత ప్రజల మీద జరిగిన దాడే అని, దళితుల మీద దాడులకు పాల్పడే వారికి చట్టాలు వర్తింపచకపోవడం అత్యంత దారుణమని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ధ్వజమెత్తారు. సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయి మీద జరిగిన పాశవిక దాడిని నిరసిస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద దళితుల ఆత్మగౌరవ సభ జరిగింది. ఈ సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ చట్టం ముందు అందరూ సమానులే అని రాజ్యాంగం చెప్తుంటే అందుకు విరుద్ధంగా చట్టపరమైన వ్యవస్థలు దళితుల మీద దాడులకు పాల్పడుతున్న వారి మీద చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. ధర్మం ముసుగులో విశ్వాసాల ముసుగులో దాడులకు పాల్పడే వారికి చట్టాలు వర్తించవా ? వారి సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయి మీద జరిగిన పాశవిక దాడిని నిరసిస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద దళితుల ఆత్మగౌరవ సభ జరిగింది. ఈ సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ చట్టం ముందు అందరూ సమానులే అని రాజ్యాంగం చెప్తుంటే అందుకు విరుద్ధంగా చట్టపరమైన వ్యవస్థలు దళితుల మీద దాడులకు పాల్పడుతున్న వారి మీద చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. ధర్మం ముసుగులో విశ్వాసాల ముసుగులో దాడులకు పాల్పడే వారికి చట్టాలు వర్తించవా ? వారి మీద చర్యలు తీసుకోరా అని ప్రశ్నించారు. దళితుల మీద దాడులకు పాల్పడితే చట్టాలు వర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

న్యాయ వ్యవస్థ, ఢిల్లీ పోలీసు వ్యవస్థ, జాతీయ మానవ హక్కుల కమిషన్ తమ కర్తవ్యాలను అమలు చేయడంలో పూర్తి వివక్షతను చూపెట్టయని అన్నారు. ఎన్నో సంఘటనల మీద పత్రికల్లో వచ్చిన వార్తలను ఆధారంగా చేసుకొని సుమోటోగా కేసులు తీసుకున్న వ్యవస్థలు దేశంలోనే అత్యున్నతమైన సుప్రీంకోర్టుకు చీఫ్ జస్టిస్ గా ఉన్న గవాయి మీద జరిగితే ఎందుకు మౌనం వహించాయి ? అని ప్రశ్నించారు.

ఘటన జరిగి నెల రోజులు గడిచినా కనీసం చట్టపరంగా ఒక చర్య కూడా ఎందుకు తీసుకోలేదు అని ప్రశ్నించారు. ఇది వివక్షతను చూపుతున్న చర్య, ఇది రాజ్యాంగ స్ఫూర్తికి పూర్తి విరుద్ధమైన చర్య అని అన్నారు. దళితుల మీద దాడులకు పాల్పడితే సహించే రోజులు పోయాయని అన్నారు. ధర్మం ముసుగులో విశ్వాసాల ముసుగులో దాడులు పాల్పడే వారికి తగిన గుణపాఠం నేర్పుతామని అన్నారు. మా పోరాటం దళితుల ఆత్మగౌరవాన్ని నిలబెట్టుకోవడానికి, న్యాయ వ్యవస్థ స్వతంత్రను పరిరక్షించుకోవడానికే కాపాడుకోవడానికి, రాజ్యాంగాన్ని జరుగుతుందని అన్నారు. రాజ్యాంగం ద్వారానే దళితులకు మానవ హక్కులు లభించి మనుష్యులుగా గుర్తించబడ్డారని అన్నారు. దళితులు ఉన్నత స్థాయికి ఎదగడానికి రాజ్యాంగమే కారణం. ఇలా ఉన్నత స్థాయిలోకి ఎదగడకపోవడం కొంత మంది జీర్ణించుకోలేకపోతున్నారని అన్నారు. అందుకే రాజ్యాంగాన్ని ధ్వంసం చేయాలని కుట్రలు చేస్తున్నారని అన్నారు. ఇలాంటి గొప్ప రాజ్యాంగాన్ని తొలగించి మను ధర్మాన్ని ప్రజల మీద రుద్దాలని చేసే వారెవరైనా మాకు బద్ధ శత్రువులే అని ప్రకటించారు. ప్రజాస్వామ్య స్థానంలో రాచరిక వ్యవస్థ తీసుకొచ్చే మను ధర్మాన్ని సహించేది లేదని అన్నారు. ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం సమానత్వం కోసం రాజ్యాంగ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు మున్నంగి నాగరాజు మాదిగ ఎమ్మార్పీఎస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు గోవిందు నరేష్ మాదిగ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సురేష్ మాదిగ వివిధ రాష్ట్రాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్పీకర్ తీరును తప్పుపట్టిన సుప్రీం

**మొదటిపేజీ తరువాయి**

ప్రశ్నించింది. ఎమ్మెల్యేల ఫిరాయింపు వ్యవహారంలో కోర్టుధిక్కర పిటిషన్‌పై తెలంగాణ స్పీకర్‌కు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోక పోవడంపై కేటీఆర్ కోర్టు ధిక్కార పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సోమవారం విచారణ జరిగింది. కోర్టుధిక్కారంపై నాలుగు వారాల్లోగా జవాబు చెప్పాలని స్పీకర్‌కి దేశ అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. ఈ పిటిషన్‌ను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్. గవాయి ధర్మాసనం విచారణ జరిపింది. మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోకపోవడం కోర్టు ధిక్కారమే.. రోజువారీగా విచారణ జరిపి నిర్ణయం తీసుకోవాలని జస్టిస్ బీఆర్ గవాయి స్పష్టం చేశారు. నాలుగు వారాల్లోగా విచారణ పూర్తి చేస్తామని స్పీకర్ తరపున న్యాయవాదులు అభిషేక్ సింగ్, ముకుల్ రోహత్గి వెల్లడిరచారు. తెలంగాణలో ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై సుప్రీంకోర్టులో సోమవారం విచారణ జరిగింది. ఈ అంశంపై సర్వోన్నత న్యాయస్థానం స్పీకర్‌కు మరో 4 వారాల గడువు ఇచ్చింది. ఈలోపు నిర్ణయం తీసుకోవాలని సూచించింది. కేసు విచారణను కూడా 4 వారాలకు వాయిదా వేసింది. తెలంగాణలో పదిమంది ఎమ్మెల్యేల అనర్హత అంశానికి సంబంధించి దాఖలైన మూడు వేర్వేరు పిటిషన్లు సోమవారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం ముందుకు విచారణకు వచ్చాయి. ఆ ఎమ్మెల్యేలకు వ్యతిరేకంగా భారత రాష్ట్ర సమితి దాఖలు చేసిన పిటిషన్లపై మూడునెలల్లోపు నిర్ణయం తీసుకోవాలని జులై 31న జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం ఆదేశించింది. అయితే విభిన్న కారణాలవల్ల ఆలోపు నిర్ణయం తీసుకోవడం సాధ్యం కానందున స్పీకర్‌కు మరో రెండునెలలు గడువు ఇవ్వాలని కోరుతూ తెలంగాణ శాసనసభ కార్యదర్శి దాఖలు చేసిన మిసిలేనియస్ అప్లికేషన్ సీజేఐ ధర్మాసనం ముందు 14వ నంబరులో లిస్ట్ అయింది. ఈక్రమంలో ఆయా పిటిషన్లపై సోమవారం విచారణ చేపట్టిన న్యాయస్థానం స్పీకర్‌కు మరో 4 వారాల గడువు ఇచ్చింది.




## తెలంగాణలోనూ ఓటు తొలగింపు కుట్ర

- బిహార్‌లో దొడ్డిదారిన ఎన్డీఏ విజయం
- ఓటు శాతం తక్కువగా వచ్చినా.. ఎన్డీయే సీట్లు గెలవడం వెనక ఆంతర్యం ఏంటి..?
- పీసీసీ చీఫ్ మహేశ్ సంచలన ఆరోపణ



**హైదరాబాద్, నవంబర్ 17(ప్రజాస్వరం)**

తెలంగాణలోనూ ఓటర్ల జాబితా నుంచి ఓట్లను తొలగించేందుకు బీజేపీ కుట్ర పన్నుతుందని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ సంచలన ఆరోపణ చేశారు. బిహార్‌లో జరిగిన ఎన్నికల ఫలితాలపై ఆయన స్పందిస్తూ, అక్కడ దొడ్డిదారిన ఎన్డీఏ విజయం సాధించి సంబురాలు చేసుకోవడం విచిత్రంగా ఉందని విమర్శించారు. సోమవారం గాంధీభవన్‌లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఎన్నికలు జరగాలని, కానీ బిహార్‌లో ఇందుకు విరుద్ధంగా జరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఓట్ చోరీపై ప్రజలను చైతన్యవంతం చేస్తూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఎనలేని పోరాటం చేస్తున్నారని తెలిపారు. బిహార్ ఎన్నికల్లో ఓట్ల శాతం తక్కువగా వచ్చి ఎన్డీఏకు సీట్లు గెలవడం వెనుక అంతర్యం ఏమిటి? అని ప్రశ్నించారు. దేశ భవిష్యత్తుకు విఘాతం కలిగించే విధంగా సెక్యులర్ ఓట్లను తొలగించడం ద్వారా ఓట్ చోరీ జరుగుతోందని ఆరోపించారు. ఈ ఓట్ చోరీ రాజ్యాంగానికి తూట్లు పొడుస్తోందని మండిపడ్డారు. ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా తీరు తెన్నులు స్పష్టంగా తెలుస్తున్నాయని, ఈసీ బీజేపీకి అనుబంధ సంస్థలా పనిచేయడం సిగ్గుచేటని ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రాజ్యాంగబద్ధంగా, న్యాయబద్ధంగా ఎన్నికలు జరిగి ఉంటే మహాగఠ్‌బంధన్‌కు 200 సీట్లు వచ్చేవని ఆయన వివరించారు.

**సౌదీ ప్రమాద బాధితుల పరామర్శ**

సౌదీ అరేబియాలో జరిగిన ఘోర బస్సు ప్రమాదంలో భారతీయ యాత్రికులు మరణించిన ఘటనపై పీసీసీ చీఫ్ దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని అడిక్‌మెట్ అచ్యుత్ మార్గ్ ప్రాంతంలో నివసిస్తున్న మృతుల కుటుంబాలను ఆయన సోమవారం పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఫిరోజ్ ఖాన్, ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ సబ్సిడీ యంత్రాలకు దరఖాస్తు చేసుకోండి

- మార్కెట్ కమిటీ చైర్మన్ ఎండి.రహమతుల్లా

**మక్తల్,నవంబర్ 17 (ప్రజాస్వరం):**

వనపర్తి జిల్లా, ఆత్మకూరు మండలానికి రైతులు వ్యవసాయానికి వినియోగించుకునే సబ్సిడీ యంత్రాలు మంజూరు కావడం జరిగింది. అందుకు వ్యవసాయ సబ్సిడీ యంత్రాల కోసం రైతులందరూ దరఖాస్తు చేసుకొని సబ్సిడీ యంత్రాలను సద్వినియోగం చేసుకోవాలని మార్కెట్ కమిటీ చైర్మన్ ఎండి రహమతుల్లా పేర్కొన్నారు. వ్యవసాయ సబ్సిడీ యంత్రాలు ఎస్సీ ఎస్టీలకు 50%, బీసీలకు 45% వస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో ఆత్మకూరు మండల అధ్యక్షుడు పరమేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు నల్గొండ శీను,మార్కెట్ వ్యవసాయ అధికారి పాల్గొన్నారు.



## కుంగిపోవద్దు, భవిష్యత్తు మనదే..

- జూబ్లీహిల్స్ ఎన్నిక ఫలితంపై స్పందించిన ఈటల
- అభ్యర్థిని ఆలస్యంగా ప్రకటించినందువల్లే ఓడిపోయామన్న ఈటల
- ఉప ఎన్నికల్లో అధికార పార్టీ గెలవడం సహజమే
- ఉప ఎన్నికల్లో ఓడినంత మాత్రాన బీజేపీ పని అయిపోయినట్లు కాదని వ్యాఖ్య
- కాంగ్రెస్ డిపాజిట్లు కోల్పోయినప్పటికీ అధికారంలోకి వచ్చిందని వ్యాఖ్య



**హైదరాబాద్, నవంబర్ 17(ప్రజాస్వరం)**

జూబ్లీహిల్స్ ఎన్నిక ఫలితంపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ స్పందించారు. బీజేపీ కార్యకర్తల్లారా.. జూబ్లీహిల్స్ ఎన్నిక ఓడిపోగానే కుంగిపోవద్దని, భవిష్యత్తు మనదే అని అన్నారు. ఉప ఎన్నికల్లో అధికార పార్టీ గెలవడం సహజమే అని పేర్కొన్నారు. తెలంగాణలో డివిజన్ పాలిటిక్స్ తో అధికారంలోకి రాలేమని.. కులం, మతం పునాది మీద రాజకీయాలు శాశ్వతంగా నడవవన్నారు. గెలిచినా, ఓడినా.. అధికారం ఉన్నా, లేకపోయినా దశాబ్దాలుగా కాషాయ జండా పట్టుకుని ప్రజల కోసం పనిచేస్తున్న పార్టీ భారతీయ జనతా పార్టీ అన్నారు. వేలాది మంది బీజేపీ కారకర్తలు, వందల మంది నాయకుల భవిష్యత్తు కోసం మాట్లాడుతున్నా.. సీఎం, మంత్రులు, కొంతమంది అవగాహన లేని నాయకులు మాట్లాడుతున్న మాటలు వింటున్నా అని ఎంపీ ఈటల చెప్పారు.'నారాయణఖేడ్, పాలేరు హుజూర్నగర్, నాగార్జున సాగర్, కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ అన్నిటిలో అధికార పార్టీ గెలిచింది. కేసీఆర్ అహంకారం అణచడానికి దుబ్బాకలో బీజేపీని గెలిపించారు. అన్యాయానికి న్యాయానికి.. ఆత్మగౌరవానికి అహంకారానికి.. ధర్మానికి అధర్మానికి జరిగిన హుజురాబాద్ ఎన్నికల్లో ధర్మం గెలిచింది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరూ ఆ ఎన్నిక కోసం ఎదురుచూశారు. స్వయంగా కేసీఆర్ వచ్చి దళిత బంధు ప్రకటించినా గెలవలేకపోయారు. తెలంగాణ వచ్చిన తరువాత 9 ఉప ఎన్నికలు జరిగితే.. 7 సార్లు అధికార పార్టీనే గెలిచింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన రెండు ఎన్నికల్లో గెలిచింది. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో అధికార పార్టీ అనేక ప్రలోభాలు పెట్టి మరీ గెలిచారు. కేసీఆర్ ఎన్ని చేశారో వీరు కూడా అవే చేశారు. కాంగ్రెస్ పార్టీకి హుజురాబాద్ లో వచ్చిన ఓట్లు 3016. దుబ్బాకలో, మునుగోడు డిపాజిట్ కోల్పోయింది. మరి డిపాజిటు కోల్పోయిన పార్టీ మొన్న ఎలా అధికారంలోకి వచ్చింది. ఒక్క బై ఎలక్షన్ ఓడిపోగానే బీజేపీ పని అయిపోతుందా?. రాజకీయ పరిజ్ఞానం ఉన్న వారు ఎవరూ అలా మాట్లాడరు' అని ఎంపీ ఈటల అన్నారు. 'బీహార్ ఎన్నికలు ఒక ప్రభంజనం. ఒళ్ళు వంచి పని చేస్తే విజయం మనదే. కార్యకర్తలు, నాయకులు సోషల్ మీడియాలో వచ్చే పోస్టులు చూసి బాధపడకండి. భవిష్యత్తు మనదే. జూబ్లీహిల్స్ ఎన్నిక ఫలితం అందరం బాధ్యత తీసుకుంటున్నాం.ప్రజలకు సేవ చేయడం వల్లనే దేశ వ్యాప్తంగా బీజేపీకి ప్రజలు ఓట్లు వేస్తున్నారు. గెలిస్తే బీజేపీ వాళ్ళు ఈవీఎంలను ఏదో చేశారని అంటున్నారు. మరి జూబ్లీహిల్స్ ఎన్నికలో ఈవీఎం మేనేజ్ చేశారా?, దొంగ ఓట్లు నమోదు చేయించారా?. తెలంగాణలో, కర్ణాటకలో కూడా మీరే గెలిచారు, మరి అక్కడ కూడా అలానే చేశారా?. మీరు గెలిస్తే ఒక న్యాయం.. మేము గెలిస్తే ఓట్ చోరీ అని అంటారా?. ఏం చేస్తావో ప్రజలకు చెప్పి ఓట్లు అడగాలి, ఇలాంటి ఆరోపణలు కాదు. బరిగీసి కొట్లాడే తత్వం లేనప్పుడు పార్టీ ముందుకు పోయే అవకాశం లేదు. అధికార పార్టీ హంగుల వల్ల ఉపఎన్నికల్లో గెలుస్తుంది. పార్టీ అంటే నాయకులు అందరూ బాధ్యత తీసుకుంటారు. కిషన్ రెడ్డి గారినో, ఇంకొకరినో బాధ్యులు చెయ్యలేం. జూబ్లీహిల్స్ లో ఎమ్మెల్యే చనిపోయిన వెంటనే బీజేపీ తిరిగి ఉంటే ఫలితం వేరుగా ఉండేది. ఒకాయన అధికారం పోతుందని, ఇంకొకరు సానుభూతితో పోటీ పడ్డారు. నా వ్యక్తిగత అభిప్రాయం.. తెలంగాణలో డివిజన్ పాలిటిక్స్ తో అధికారంలోకి రాలేము. బీహార్లో మాకు ఇన్ని సీట్లు వచ్చాయి అంటే అందరి మద్దతు ఉంది. ట్రిపుల్ తలాక్ లాంటివి పని చేసాయి. మా సర్ సంగ్ చాలక్ ఒక గొప్ప మాట చెప్పారు.. ఒక జాతిని విస్మరించి దేశాన్ని నిర్మాణం చేయలేమని చెప్పారు. మోడీ గారు ప్రధాని కాగానే ఒక మెసేజ్ ఇచ్చారు. ప్రజలకు ఇప్పటి వరకు ఏం చేసావు, ఇక ముందు ఏం చేస్తావు అని చెప్పి ప్రజలను ఓట్లు అడగాలి' అని ఎంపీ ఈటల చెప్పారు.

## అధికార పార్టీ నాయకులు ప్రతిపక్ష నేతల మీద కక్ష సాధింపు చర్యలు, అక్రమ కేసులు పెట్టుడు మానుకోవాలి

- మాజీ డిప్యూటీ స్పీకర్ ఏం పద్మ దేవేందర్ రెడ్డి

**రామాయంపేట, నవంబర్ 17(ప్రజాస్వరం):**

మెదక్ పట్టణ పార్టీ కన్వీనర్ మాజీ కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు పైన ఒక వ్యక్తి పెట్టిన ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు తప్పుడు కేసు నమోదు చేయడానికి తీవ్రంగా ఖండిస్తూ మాజీ డిప్యూటీ స్పీకర్ ఏం పద్మ దేవేందర్ రెడ్డి,మెదక్ మాజీ మున్సిపల్ చైర్మన్లు మల్లికార్జున్ గౌడ్,బట్టి జగపతి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి మాజీ కౌన్సిలర్లు నాయకులతో కలసి సోమవారం మెదక్ డిఎస్పి ప్రసన్నకుమార్ ను కలసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పద్మదేవేందర్ రెడ్డి మాట్లాడుతూ.. తప్పుడు కేసు నమోదు చేయడం విషయంలో పూర్తి విచారణ జరిపి కేసు కొట్టివేయాలని కోరారు. సంఘటననే జరగనప్పుడు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు ఎలా ఎఫ్ఐఆర్ ఫైల్ చేస్తారని డిఎస్పిని ప్రశ్నించారు. ఇదేవిధంగా అధికార పార్టీ నేతలు ఇలాంటి కేసులు పెట్టుకుంటా పోతే ఉపేక్షేది లేదని, పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేస్తామని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు పోలీస్ వ్యవస్థ పై గౌరవాన్ని పెంచే విధంగా ఉండాలి, కానీ ఆ గౌరవాన్ని తగ్గించే విధంగా ఉండకూడదని పేర్కొన్నారు.పార్టీ కార్యకర్తకు, నాయకులకు అందరికీ అండగా ఉంటామని ధీమా వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికార పార్టీ నేల నేతలు ఇలాంటి తప్పుడు పెట్టడం, రాత్రిపూట ప్రతిపక్ష నాయకుల ఇండ్ల పైకి పోలీసులను పంపడం అరెస్టులు చేస్తామనడం, బెదిరింపులకు గురి చేయడం, కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు చేయడం మానుకోవాలని హెచ్చరించారు. లేని యెడల బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో తీవ్ర పరిమాణాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఈ సందర్భంగా హెచ్చరించారు. ప్రతిపక్ష నాయకుల పైన కేసులు పెట్టడంలో ఉన్న శ్రద్ధ మెదక్ అభివృద్ధిపై పెట్టాలని విమర్శించారు.





# కార్తీక మాసం సామూహిక సత్యనారాయణ వ్రతాలు

**దౌల్తాబాద్ నవంబర్ 17 (ప్రజాస్వరం) :**

మండల కేంద్రమైన దౌల్తాబాద్‌లోని శ్రీ అలివేలుమంగ-పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం ఆధ్వర్యంలో కార్తీక మాసం సందర్భంగా నవంబర్ 18వ తేదీ (మంగళవారం) ఉదయం 9 గంటలకు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు ఘనంగా నిర్వహించబడనున్నాయి. పవిత్ర కార్తీక మాసం నేపథ్యంలో భక్తులకు ఆధ్యాత్మిక చైతన్యం కలిగించేందుకు దేవాలయం తరపున ఈ ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. వ్రతంలో పాల్గొనే భక్తులకు వ్రతము అనంతరం భోజన సదుపాయం కూడా కల్పించనున్నట్టు ఆలయ కమిటీ తెలిపింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని సత్యనారాయణ స్వామి, శ్రీ అలివేలు మంగ-వెంకటేశ్వర స్వామి అనుగ్రహం, ఆశీస్సులు పొందాలని కమిటీ కోరింది. వ్రతంలో కూర్చోవాలనుకునే భక్తులు ముందస్తుగా తమ పేర్లను నమోదు చేసుకోవడానికి ఆలయ నిర్వాహకులు కింది ఫోన్ నంబర్లు అందుబాటులో ఉంచారు: 9440220877,9441218245,9666524646.కార్తీకమాసం ఆధ్యాత్మికతలో భాగస్వాములై దేవుని కృపకు పాత్రులు కావాలని దేవాలయ కమిటీ ఆకాంక్షిస్తోంది. శ్రీ సత్యనారాయణ స్వామి, శ్రీ వెంకటేశ్వర స్వామి ఆశీస్సులు భక్తులందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆలయ నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

# పటేల్ జయంతి వేడుకల్లో దౌల్తాబాద్ నాయకులు




**దౌల్తాబాద్ నవంబర్ 17(ప్రజాస్వరం) :**

భారత సమగ్రతకు శిల్పి, ఆధునిక భారత నిర్మాణంలో కీలకపాత్ర పోషించిన సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భాన్ని పురస్కరించుకొని మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు ఆదేశాల మేరకు సోమవారం సిద్దిపేట పట్టణ ప్రాంగణంలో యూనిటీ ఆఫ్ మార్చ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దౌల్తాబాద్ మండలానికి చెందిన వివిధ విభాగాల నాయకులు, యువజన ప్రతినిధులు, కార్యకర్తలు విశేషంగా పాల్గొన్నారు. దేశ ఐక్యత, సామరస్య, సమగ్రత వంటి విలువలను గుర్తు చేస్తూ వారు ఏకత్వ నినాదాలతో ర్యాలీని పురోగమింపజేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ స్వతంత్ర భారత్‌ను 562 సంస్థానాలను ఏకం చేసి ఒకే భారత దేశంగా రూపుదిద్దిన దౌత్యనైపుణ్యం, కఠిననిశ్చయం, దేశభక్తి స్ఫూర్తి పటేల్‌ను మహానాయకుడిగా నిలబెట్టాయని పేర్కొన్నారు. దేశాన్ని ఒకే జెండా కింద నిలబెట్టిన మహోన్నత కార్యం తరతరాలకు ప్రేరణ అని అభివర్ణించారు. పటేల్ సిద్ధాంతాలు యువతలో నేటికీ వెలుగులు నింపుతున్నాయని, ఆయన ధైర్యం, క్రమశిక్షణ, పరిపాలనా నైపుణ్యం భారత చరిత్రలో చిరస్మరణీయమని తెలిపారు. కార్యక్రమం దేశభక్తి గీతాలతో, పటేల్ జీవితం-సేవలను గుర్తు చేసే సందేశాలతో, ఐక్యతను ప్రతిబింబించే నినాదాలతో ఉత్సాహంగా సాగింది. నాయకులు, కార్యకర్తల భారీ పాల్గొనడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమం కోనయపల్లి తాజా మాజీ సర్పంచ్ సురేందర్ రెడ్డి, దేవుడి నరసింహారెడ్డి, డాక్టర్ కిషన్ గుప్త తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# వైద్య విద్యారంగానికి గొప్ప మైలురాయి


- **180 కోట్ల అంచనా వ్యయంతో అత్యాధునిక మెడికల్ కళాశాల**
- **ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్**

**మెదక్, నవంబర్ 17 (ప్రజా స్వరం) :**



వైద్య రంగ అభివృద్ధికి ఇది ఓ చిరస్మరణీయ ఘట్టమని, జిల్లా విద్యార్థులకు మెడికల్ సీట్లు అందుబాటులోకి రావడం, వైద్య సేవలు మరింత అందుబాటులోకి రావడం వల్ల స్థానిక ప్రజలకు, విద్యార్థులకు సహాయపడుతుందని ఎమ్మెల్యే తెలిపారు. మెదక్ పట్టణంలోని పిల్లికొటల శివారులో ప్రభుత్వ వైద్య కళాశాలకి శంకుస్థాపన భూమి సర్వే నెంబర్ 890 లో, 20 ఎకరాల విస్తీర్ణ భూమిలో, రాష్ట్ర ప్రభుత్వం రూ.180 కోట్ల అంచనా వ్యయంతో అత్యాధునిక సౌకర్యాలతో, నూతన ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణానికి సోమవారం ఎమ్మెల్యే రోహిత్ రావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రోహిత్ రావు మాట్లాడుతూ "ప్రభుత్వ ప్రాదినిత్యం, సమగ్ర వైద్య సదుపాయాలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. నూతన వైద్య కళాశాలతో జిల్లా అభివృద్ధి మరింత వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రాథమిక వైద్యంతో పాటు అత్యంత ప్రధానమైన వైద్య విద్యను అందించేలా మెడికల్ కళాశాలను రూపొందిస్తున్నామని అన్నారు. ప్రతిభావంతులకు మెడికల్ విద్యను అందించే లక్ష్యంతో ప్రభుత్వం ముందడుగు వేస్తుందన్నారు. నూతనంగా నిర్మించనున్న వైద్య కళాశాల భవనాలు, అనుబంధ హాస్పిటల్ ఆధునాతన వైద్య సదుపాయాలతో నిర్మాణాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ నితిన్ కాబ్రా, సూపర్డెంట్ సునీత, డిసి హెచ్ ఎస్ శివ దయాల్, ఎంసీఏ హెచ్ ఓ డి రాజశ్రీ, వివిధ, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.





# దళారుల నమ్మి మోసపోవద్దు



**దౌల్తాబాద్, నవంబర్ 17(ప్రజాస్వరం) :**

రైతులు ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన దాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని అమ్మి మద్దతు ధర పొందాలని ఐకెపి సిసి బాలరాజు పేర్కొన్నారు. మల్లేశం పల్లి ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు మద్దతు ధర అందించడానికి ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని , రైతులు వాటిని సద్వినియోగం చేసుకొని మద్దతు ధర పొందాలని కోరారు. ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యత ప్రమాణాలు పాటించి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని కోరారు. రైతులకు కొనుగోలు కేంద్రాలలో మౌలిక వసతులను ఏర్పాటు చేస్తున్నామని, వర్షాలకు ఇబ్బందులు తలెత్తకుండా తార్పాలీన్లను అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు. రైతులు ఐకెపిసి సిబ్బందికి సహకరించి సహృదయకర వాతావరణంలో ధాన్యం కొనుగోలు జరిగే విధంగా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఏ అనిత, మహిళా సంఘాల సభ్యులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# నూతన సిఎస్ఐ పాస్నేట్ కమిటీ ఎన్నిక



**మెదక్, నవంబర్ 17 (ప్రజా స్వరం) :**

సిఎస్ఐ మెదక్ పాస్నేట్ ఎన్నికల్లో విజయం సాధించిన జీఎస్పీ ప్యానెల్ సభ్యులు వివిధ హోదాల్లో నామినేట్ పద్ధతి లో ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా మెదక్ సిఎస్ఐ ప్రెస్ బీటర్ ఇంచార్జీ శాంతయ్య ఆధ్వర్యంలో సిఎస్ఐ మెదక్ పాస్నేట్ కమిటీ ఎన్నిక నిర్వహించగా పాస్ట్రేట్ సెక్రటరీ గెలన్ చిత్తరంజన్, పాస్ట్రేట్ స్టీవర్డ్ ప్రభుదయానంద్, ట్రెజరర్ గంట సంపత్, చర్చి స్టీవర్డ్ గా దేవ ప్రకాశం, పూర్ ఫండ్ సెక్రటరీ వరప్రసాద్, ప్రాపర్టీ సెక్రటరీ బైరం సుషీల్, విమెన్ సెక్రటరీ లిల్లి గ్రేస్, యూత్ సెక్రటరీ మాణిక్య రావు, సండే స్కూల్ సెక్రటరీ ఆరే ప్రభుదాస్, ఎవాంజిలిసం సెక్రటరీ వేముల శ్రీనివాస్, భజన సెక్రటరీ మంగ సురేందర్, ఆడియో/వీడియో/క్వైర్ సెక్రటరీ మోసెస్ మనోహర్ (కన్నా మిన్న), సీనియర్ సిటిజెన్ కన్వీనర్ ఫ్రాంక్ జాన్సన్ గా ఎన్నికయ్యారు.

# కాంగ్రెస్ నేత రామచంద్ర గౌడ్ మృతి



- **మాజీ డిప్యూటీ స్పీకర్ నివాళి**

**మెదక్, నవంబర్ 17 (ప్రజా స్వరం) :**

హవేలీ ఘనపూర్ మండలం మద్దుల్ వాయి మాజీ సర్పంచ్, కాంగ్రెస్ సీనియర్ నేత గుండారం రామచందర్ గౌడ్ అనారోగ్యంతో మృతి చెందాడు. కాంగ్రెస్ పార్టీలో జిల్లా స్థాయి పదవుల్లో కొనసాగారు. సొంత గ్రామాల్లో సర్పంచ్ గా గెలిచి గ్రామ అభివృద్ధి కి కృషి చేశారు. గత కొంతకాలంగా అనారోగ్యం బాధపడుతున్న ఆయన ఆదివారం రాత్రి మృతి చెందాడు. ఆయన మృతి చెందిన విషయం తీసుకున్న మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి ముత్తాయికోట గ్రామానికి చేరుకొని రామచంద్ర గౌడ్ పార్థీవదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం మాజీ సర్పంచ్ కిరణ్ గౌడ్ పరామర్శించి,వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని తెలిపారు.రామచంద్ర గౌడ్ మృతి పట్ల ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కాంగ్రెస్ నేతలు సైతం మాజీ సర్పంచ్ మృతి పై సంతాపం తెలిపారు.

# పేరుకు సర్టిఫికెట్ బ్లాక్ బెల్ట్ ఉంటే సీనియర్ కాదు

- **నిత్యం శిక్షణలో ఉండే వారే సీనియర్ మాస్టర్లు**
- **కరాటే మాస్టర్లు ఎప్పటికప్పుడు నూతన శిక్షణలో ఉండాలి**
- **యువ స్పోర్ట్స్ కరాటే అకాడమీ తెలంగాణ వ్యవస్థాపకులు కరాటే మాస్టర్ బురాని శ్రీకాంత్-**

**దుబ్బాక , నవంబర్ 17 (ప్రజాస్వరం) :**

సిద్ధిపేట జిల్లాలో కలిగిన కరాటే మాస్టర్ల నియామక విషయంలో యువ స్పోర్ట్స్ కరాటే అకాడమీ తెలంగాణ వ్యవస్థాపకులు కరాటే మాస్టర్ బురాని శ్రీకాంత్ కీలక వ్యాఖ్యలు చేశారు.దుబ్బాక మండల కేంద్రంలో కరాటే మాస్టర్ బురాని శ్రీకాంత్ మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ తన పై శిక ఎల్లగౌడ్ అనే సీనియర్ కరాటే మాస్టర్ డి వై ఎస్ ఓ నియామకాలు సరిగానే జరిగాయాని చెప్పడం విడ్డురంగా ఉన్నదని గత పది సంవత్సరాలలో ఎక్కడ కూడా పి ఎమ్ శ్రీ స్కూల్లో చెప్పని నువ్వు ఇప్పుడు కొత్తగా వచ్చి ఎలాంటి అనుభవం లేకుండా కరాటే క్లాసులు చెబుతా అనడం ఆశ్చర్యంగా ఉంది.గతంలో లచ్చపేట ఆదర్శ పాఠశాలలో హెచ్ బి టి గా టీచింగ్ చేసి సరిగా విధులు నిర్వహించలేదని తొలగించరాణి ఆరోపణలు ఉన్నాయి? ఇప్పుడు మళ్ళీ కొత్తగా సీనియర్ కరాటే మాస్టర్ ను అంటూ ఈ రంగంలోకి వచ్చావ్? “పేరుకు సర్టిఫికెట్ బ్లాక్ బెల్ట్ ఉంటే సీనియర్ కాదు. నిత్యం శిక్షణలో ఉండే వారే సీనియర్ మాస్టర్లు.విద్యార్థులకు భద్రంగా ఉన్న మార్గదర్శకత్వం కావాలి. DYSO అధికారిని షరతులు పాటించకుండానే సర్టిఫికెట్ ఉన్న వారే వీరి నియామకానికి సంస్థలు ప్రయత్నించడం వల్ల విద్యార్థుల భవిష్యత్తుపై దెబ్బపడే అవకాశం ఉంది” అని అన్నారు.ఈ సందర్భంగా కేవలం బెల్ట్ లేదా సర్టిఫికెట్ వల్లే సీనియర్ మాస్టరుగా గుర్తించకూడదు. రియల్ గానే విద్యార్థులకు క్రమశిక్షణ, నైపుణ్యం కల్పించడంలో క్రియాశీలంగా ఉండేవారే సీనియర్ మాస్టర్లు.




గత పదేళ్లలో సమగ్ర శిక్షలో కరాటే క్లాసులు

చేపట్టని కొందరు కూడా ఇప్పుడు తమను తాము సీనియర్ మాస్టర్స్ అంటూ ప్రెస్ మీట్లిస్తుండటం సరికాదని వివరించారు.DYSO అధికారిని అనుమతించగానే అవకాశం వస్తుందని భావించి, కేవలం సర్టిఫికెట్ ఆధారంగా నియామకం చేయడం వల్ల విద్యార్థులకి నష్టమని చెప్పారు.కరాటే మాస్టర్లు ఎప్పటికప్పుడు నూతన శిక్షణలో ఉండాలి; ఎప్పుడూ నిత్య విద్యార్థిగా అభివృద్ధి చెందాలి.ముఖ్యంగా, మాస్టర్లను ఎంపిక చేసే ముందు డెమో క్లాస్‌లు నిర్వహించి వారి నైపుణ్యాన్ని పరీక్షించాక నియామకం చేయాలని ఆయన స్పష్టం చేశారు. విద్యార్థుల భద్రత, భవిష్యత్తు కోసం అవాంఛనీయ నియామకాలను నివారించేందుకు విద్యా విభాగం, ఏజెన్సీలు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అన్నారు.కరాటే మాస్టర్ల నిజమైన క్వాలిఫికేషన్ నిర్ధారించేందుకు డెమో క్లాస్‌లు నిర్వహించడమే మేలని అభిప్రాయపడుతున్నామని అన్నారు. రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి క్రీడారంగంపై ప్రత్యేక దృష్టి పెట్టి స్పోర్ట్స్ హబ్ గా ముందుకు పోయేట్టుగా కృషి చేస్తామన్నారు..

# కొమురవెల్లి జాతరను వైభవోపేతంగా నిర్వహించాలి

- స్వామివారి ప్రసాదం తయారీలో అత్యున్నత నాణ్యతా ప్రమాణాలను పాటించాలి
- జాతరపై మంత్రి కొండ సురేఖ సమీక్ష

**సిద్దిపేట, (ప్రజాస్వరం) :**



సిద్దిపేట జిల్లా కొమరవెల్లి మండల కేంద్రంలోని శ్రీ కొమురవెల్లి మల్లన్న కల్యాణం, జాతరలను తెలంగాణ ఆధ్యాత్మిక సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా వైభవోపేతంగా నిర్వహించాలని దేవాదాయ ధర్మాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. వేలాదిగా జాతరకు తరలి వచ్చే భక్తులను దృష్టిలో పెట్టుకుని ఏ చిన్న పొరపాటు తలెత్తకుండా పటిష్టమైన కార్యాచరణతో ఏర్పాట్లు చేయాలని మంత్రి సురేఖ అధికారులకు సూచించారు. సోమవారం డా.బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సెక్రటేరియట్ లోని దేవాదాయ ధర్మాదాయ మంత్రిత్వశాఖ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో మంత్రి సురేఖ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమావేశం కంటే ముందు మల్లన్న జాతర, కల్యాణం పోస్టరును మంత్రి సురేఖ రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి జనగామ, ఎండోమెంటు ప్రిన్స్ పల్ సెక్రటరీ శైలజ రామయ్యర్, దేవాదాయ శాఖ కమిషనర్ హరీష్, సిద్దిపేట కలెక్టర్ హైమావతి, సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ ఉన్నతాధికారులు, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, సిద్దిపేట అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ, ఆర్డీవో, కొమురవెల్లి ఆలయ ఈవో టంకశాల వెంకటేశ్, ఆర్టీసి డిపో మేనేజర్, డిఎంహెచ్ఓ, డిపిఓ, డిస్ట్రిక్ట్ వెల్ఫేర్ ఆఫీసర్, ఆర్ అండ్ బి, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి,గ్రామీణ నీటి సరఫరా, ఫైర్, ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ తదితర శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. రివ్యూ సమావేశంలో దేవాదాయ శాఖ మంత్రి సురేఖ మాట్లాడుతూ. గత సంవత్సరం కంటే మరింత వైభవోపేతంగా మల్లికార్జున స్వామివారి కల్యాణం, జాతరను నిర్వహించనున్నట్లు తెలిపారు. గత సంవత్సరం జాతర, కల్యాణం నిర్వహించిన సమయంలో తలెత్తిన ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఈ సారి అవి రాకుండా చూడాలని సూచించారు. డిసెంబర్ 14 ఉదయం 10.45 గంటలకు శ్రీ మల్లికార్జున స్వామి వారి కల్యాణాన్ని, జనవరి 18 నుండి 10 వారాలపాటు మార్చి 16 వరకు జాతరను నిర్వహించేందుకు నిర్ణయించినట్లు మంత్రి సురేఖ ప్రకటించారు. ఈ దిశగా భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు చేయాలని పోలీస్, విద్యుత్, వైద్యారోగ్యం, ఆర్టీసి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, ఆర్ అండ్ బి తదితర శాఖల అధికారులను మంత్రి సురేఖ ఆదేశించారు. భక్తులు ఎలాంటి ఇబ్బంది కలగకుండా కల్యాణాన్ని వీక్షించి, స్వామి అమ్మవార్లను దర్శించుకుని తిరుగు ప్రయాణమయ్యేందుకు వీలుగా అన్ని శాఖలు సమన్వయంతో వ్యవహరించేలా చర్యలు చేపట్టాలని మంత్రి సురేఖ కలెక్టర్ ను నిర్దేశించారు. స్వామివారి ప్రసాదం తయారీలో అత్యున్నత నాణ్యతా ప్రమాణాలను పాటించాలని మంత్రి అధికారులకు సూచించారు. జాతర జరుగుతున్నన్ని రోజులు సాయంత్రాల్లో కళాబృందాలచే ఒగ్గుకథ వంటి జానపద కళారూపాలను ప్రదర్శించేలా సాంస్కృతిక శాఖకు ఆదేశాలివ్వాలని కలెక్టర్ కు మంత్రి సూచించారు. కల్యాణోత్సవానికి వారం రోజుల ముందే సర్వసన్నద్ధంగా వుండేలా కార్యాచరణను వెంటనే అమలుపరచాలని మంత్రి సురేఖ అధికారులకు సూచించారు. ఆలయంలో... ఆలయ ఆవరణలో పరిశుభ్రత తప్పనిసరి అని..అందుకోసం అవసరమైతే పారిశుధ్య సిబ్బందిని ప్రత్యేకంగా అపాయింట్ చేసుకోవాలని కలెక్టర్ కు చెప్పారు.



# సమస్యల పరిష్కారానికై ఫోన్ ఇన్ కార్యక్రమం

- సిద్దిపేట పోలీస్ కమిషనర్ విజయ్ కుమార్

**సిద్దిపేట్ /దుబ్బాక , నవంబర్ 17 (ప్రజాస్వరం) :**

ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు, సమస్యలు స్వీకరించి వాటిని పరిష్కరించే లక్ష్యంతో "పోలీస్ కమీషనర్ తో ఫోన్ ఇన్" కార్యక్రమం వారంలో ఒకరోజు నిర్వహించడం జరుగుతుంది. ప్రజలు తమ పరిసరాలలో గమనించిన నేర కార్యకలాపాలు, మరియు ప్రజా సమస్యలు వంటి ముఖ్యమైన అంశాల గురించి నేరుగా కమిషనర్ తో మాట్లాడవచ్చు.ఈ కార్యక్రమం ప్రతి శనివారం ఉదయం 11.00 నుండి 12.00 గంటల వరకు చరవాణి నెంబర్ 8712667100, 8712667306, 8712667371 కు ఫోన్ చేసి వివరించవచ్చు.ప్రజలు, పోలీసుల మధ్య బంధాన్ని మరింత బలోపేతం చేయడానికి ఈ వేదిక ఉపయోగపడుతుంది. పౌరులు నిర్భయంగా తమ సమస్యలను పోలీస్ దృష్టికి తీసుకురావాలని కోరడమైనది. అందిన ప్రతి ఫిర్యాదును గోప్యంగా ఉంచి,చట్ట ప్రకారం చర్యలు తీసుకోబడుతుంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, నేర రహిత సమాజం కోసం పౌరులందరూ సహకరించాలని కోరారు.



# బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

- సీడీపీవో స్వరూప రాణి

**చిన్నశంకరంపేట, (ప్రజాస్వరం) :**

బాల్య వివాహాలు 18 సంవత్సరాల కంటే తక్కువ ఉన్న బాలికలకు పెళ్లిళ్లు చేయొద్దని రామాయంపేట సిడిపిఓ స్వరూప రాణి తెలిపారు. చిన్న శంకరంపేట ఎంపీపీ కార్యాలయంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలన అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆడపిల్లలకు 18 సంవత్సరాలు నిండకముందే వివాహాలు జరిపినచో చట్టరీత్యా చర్యలు ఉంటాయని తెలిపారు. ఒకవేళ బాల్య వివాలు జరిపినచో రెండు సంవత్సరాలు జైలు, ఒక్క లక్ష రూపాయలు జరిమాణ ఉంటుందని తెలిపారు. తల్లిదండ్రులకు, సంరక్షకులకు, పూజారికి జైలు శిక్ష తప్పదని వారు హెచ్చరించారు. బాల్యవివాహాలు జరపడం అంటే పేదరికం, అనేక సమస్యలకు దారితీస్తుందన్నారు. అందుకని ప్రతి ఆడపిల్ల చదువుకోవాలని సూచించారు. చిన్న వయసులో వివాహం జరిపితే, శారీరకంగా అనేక సమస్యలు వస్తాయని వారు తెలియజేశారు. ప్రతి గ్రామంలో తల్లిదండ్రులకు బాల్య వివాహాల పై అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సై నారాయణ గౌడ్, తహసిల్దార్ ప్రభుదాస్, ఎంఈఓ పుష్ప వేణి, ప్లాన్ ఎన్జీవో వెంకటేశ్వర్లు, మంజుల, విజన్ ఎన్జీవో యాదగిరి, న్యాయవాది బాల నరసింహులు, ఎంపీ ఓ గిరిజారని, పీహెచ్ఓ యాదగిరిరావు, ఐసిడిఎస్ సూపర్వైజర్లు అంజమ్మ, సంధ్య, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, అంగన్వాడి కార్య

# వంద శాతం గ్రౌండింగ్ కావాలి

- మంజూరు అయిన ప్రతీ ఇల్లు నిర్మాణం కావాలి
- స్పెషల్ డ్రైవ్ తో పూర్తి చేయండి
- అధికారులు క్షేత్ర స్థాయిలో దృష్టి పెట్టాలి
- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**మెదక్, నవంబర్ 17 (ప్రజా స్వరం) :**

నిరుపేదలకు కనీస నివాస గృహం ఉండాలన్న సంకల్పం తో ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు జిల్లా లో వంద శాతం త్వరగా పూర్తి కావాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. టేక్మాల్ మండలంలో పర్యటించిన కలెక్టర్ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతి పనులను పరిశీలించారు. పెండింగ్ లో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండింగ్ అంశం మీద సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముందుగా అన్ని గ్రామాల వారీగా ఇంకా నిర్మాణాలు ప్రారంభించకుండా ఉన్న వాటి వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు సుమారు 55 కోట్ల రూపాయల బిల్లుల చెల్లింపు పూర్తి అయిందన్నారు. 2,439 ఇందిరమ్మ ఇండ్ల బేస్మెంట్ పూర్తి చేశారని, 944 గోడలు పూర్తి చేశారని, 673 స్లాబుల స్థాయిలో ఉన్నాయన్నారు. ఇప్పటి వరకు 24 ఇండ్ల నిర్మాణాలు పూర్తి అయ్యాయని, ఇప్పటికీ 15 ఇందిరమ్మ ఇండ్లు ప్రారంభించడం జరిగిందన్నారు. నిరుపేదలకు పక్కా ఇల్లు ఉండాలని ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని తీసుకు వచ్చిందని జిల్లాలో మంజూరైన ఇందిరమ్మ ఇండ్లు పురోగతి వేగం పెంచాలన్నారు. మంజూరు అయిన ప్రతీ ఇళ్ల నిర్మాణం ప్రారంభం కావాల్సిందేనని కలెక్టర్ స్పష్టం చేశారు. అసలు ఇంకా ఎందుకు నిర్మాణం చేపట్టలేదో అధికారులు క్షేత్ర స్థాయి లోకి వెళ్లి లబ్ధిదారుల తో మాట్లాడి వారి సమస్యలు ఏమైన ఉంటే తెలుసుకోవాలన్నారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయ్యి ఎవరైనా ఇంకా మొదలు పెట్టని వారి ఇండ్లు రద్దు చేసి, అవసరం ఉన్న లబ్ది దారులకు ఇవ్వాలని హౌసింగ్ అధికారులకు సూచించారు. మార్కింగ్ చేసినప్పటికీ ఇంకనూ బెస్మెంట్ నిర్మాణం చేయని లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్య లను తెలుసుకొని ఆ నిర్మాణాలు త్వరగా పూర్తి అయ్యేలా అధికారులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.





# వేలంలో ఇసుకకు అధిక ధర

**నార్సింగి నవంబర్ 17 (ప్రజా స్వరం) :**




సీజ్ చేసిన ఇసుక వేలం ప్రభుత్వానికి కాసుల వర్షం కురిపించింది. గత శుక్రవారం రెవెన్యూ, పోలీస్ శాఖ సంయుక్తంగా దాడి నిర్వహించి దాదాపు 15 ట్రాక్టర్ల ఇసుకతో పాటు మరో 4 ట్రాక్టర్ల ఇసుక డంప్ సోమవారం మధ్యాహ్నం బహిరంగ వేలం వేస్తామని తహసీల్దార్ గ్రేస్ బాయి ప్రకటించారు. అంతకు ముందు ఉదయం ఇందిరమ్మ కమిటి సభ్యులు తహశీల్దార్ ను ప్రజావాణి సందర్భంగా కలిసి సీజ్ చేసిన ఇసుకను కుదిరితే వేలం వేయకుండా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేస్తున్న వారికి ఉచితంగా పంపిణీ చేయాలని, లేదా ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ఇసుకను అందించాలని వినతి పత్రాన్ని సమర్పించారు. అనంతరం తహసీల్దార్ గ్రేస్ బాయి, ఎంపీడీఓ వంగ ప్రీతి రెడ్డి, ఎస్ఐ బీమరి సృజన, ఆర్ ఐ శ్రీధర్, జీపీఓ నాగరాజు, ఈఓ నాగభూషణం, శంఖాపూర్ పంచాయితీ కార్యదర్శి మౌనిక సమక్షంలో వేలంలో పాల్గొనడానికి వచ్చిన వారితో సమ్మతిస్తే సీజ్ చేసిన ఇసుకను ఇందిరమ్మ ఇండ్ల కోసం ఇసుక సరఫరా గురించి చర్చించారు. ప్రత్యామనాయ మార్గమే చూడాలని, ఇక్కడ ఉన్న ఇసుక సరిపోదని, ఒకరికి అంది ఒకరికి అందక పోతే ఇబ్బందులు తలెత్తుతాయని, డంప్ వేలం వేయడమే సరైందని తెలిపారు. అందుకు తహశీల్దార్ ఇసుక డంప్ వేలం వేయగా 13 మంది వేలంలో పాల్గొనగా బొండ్ల రాకేష్ అనే వ్యక్తి 1.99 లక్షలకు దక్కించుకున్నారు. ఇసుక డంప్ అంత ధర పలకడం పై అందరూ విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా తాసిల్దార్ గ్రేస్ బాయ్ తెలిపారు.

# జర్నలిస్టుల సమస్యలు పరిష్కరానికి కృషి చేస్తా

- టీయూడబ్ల్యూజే ఐజేయు జిల్లా అధ్యక్షులు శంకర్ దయాల్ చారి

**చిన్న శంకరం పేట, (ప్రజాస్వరం) :**

జర్నలిస్టుల పక్షాన వారికున్న సమస్యల పట్ల పోరాటం చేసి జర్నలిస్టుల సంక్షేమానికి టీయూడబ్ల్యూజే ఐజేయు యూనియన్ ముందుంటుందని జిల్లా అధ్యక్షుడు శంకర్ దయాల్ చారి పేర్కొన్నారు. సోమవారం చిన్న శంకరంపేట మండల కేంద్రంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అర్హులైన ప్రతి ఒక్కరికి అక్రిడేషన్ కార్డులు, హెల్త్ కార్డులు మంజూరయ్యేలా కృషి చేస్తానన్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించకపోతే పోరాటం చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే ఐజేయు జిల్లా జాయింట్ సెక్రెటరీ ఆంజనేయులు గౌడ్, సీనియర్ జర్నలిస్టులు వెంకన్న బాబు, చంద్రం గౌడ్, కుమ్మరి యాదగిరి,దేవరాజు, రాచర్ల నరేందర్, కృష్ణ గౌడ్,



## ఘనంగా సర్దార్ వల్లభాయ్ పటేల్

# జయంతి వేడుకలు




**సిద్దిపేట/ దుబ్బాక , నవంబర్ 17 (ప్రజాస్వరం) :**

సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి వేడుకలను పురస్కరించుకొని సిద్దిపేటలో ఎక్తా ర్యాలీని ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల నుండి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వరకు సాగిన ర్యాలీని మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు, అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, జిల్లా అధికారులు మరియు ప్రభుత్వ-ప్రైవేట్ విద్యాసంస్థల విద్యార్థులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ, భారతదేశ తొలి ఉప ప్రధాని మరియు హోం మంత్రి అయిన ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ దేశ సమగ్రత మరియు ఐక్యత కోసం అహర్నిశలు పనిచేశారని అన్నారు. స్వాతంత్ర్యం సమయానికి భారత్‌లో 565 కు పైగా సంస్థానాలు ఉన్నప్పటికీ, అవన్నీ ఒకే దేశంగా నిలవాలని సర్దార్ పటేల్ పిలుపునిచ్చారని తెలిపారు. హైదరాబాద్, జమ్ము-కాశ్మీర్ వంటి కొన్ని రాజ్యాలు స్వతంత్ర్య దేశాలుగా కొనసాగాలని ప్రయత్నించినప్పటికీ, నిజాం నవాబు పై ఆపరేషన్ పోలో పేరుతో హైదరాబాద్ పై భారత్ చేపట్టిన యుద్ధం అనంతరం దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 13 నెలల తరువాత హైదరాబాద్ 1948 సెప్టెంబర్ 15న అధికారికంగా భారతదేశంలో విలీనమైందని గుర్తు చేశారు. ఈ సందర్భంగా భారత ప్రభుత్వం సర్దార్ పటేల్ జన్మదినాన్ని జాతీయ ఐక్యత దినోత్సవం (National Unity Day) గా ప్రకటించిందని తెలిపారు. దేశాన్ని విచ్ఛిన్నం చేయాలనే కుట్రలు దేశ సమగ్రతకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నాయని పేర్కొంటూ, దేశం ఏక్ భారత్, శ్రేష్ఠ్ భారత్ గా ప్రపంచంలోనే



నెంబర్ వన్ గా నిలవాలని, భారతదేశాన్ని 2047 నాటికి వికసిత దేశంగా తీర్చిదిద్దేందుకు యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుతూ, విద్యార్థులకు జాతీయ ఐక్యత ప్రతిజ్ఞ చేయించారు. తరువాత ప్రభుత్వం డిగ్రీ కళాశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్యం, ఐక్యత కోసం ప్రాణాలు అర్పించిన మహనీయుల చరిత్రను పాఠ్యపుస్తకాలలో చేర్చే పనిని ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోందని తెలిపారు. దేశ సమైక్యతను భంగం చేసే ఎవరికైనా భవిష్యత్తులో తగిన శిక్ష తప్పదని స్పష్టం చేశారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు, దేశ ప్రజలు సంఘటితంగా ముందుకు సాగి 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశాల సరసన మార్గనిర్దేశకంగా నిలబెట్టాలని ఎంపి పిలుపునిచ్చారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించి, ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులు మరియు పాఠశాల యాజమాన్యాలను సత్కరించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి మాట్లాడుతూ, సర్దార్ పటేల్ దేశాన్ని బలమైన సమైక్య భారతంగా తీర్చిదిద్దిన మహనీయుడు అని, యువత ఆయన బాటలో నడవాలని సూచించారు. అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ మాట్లాడుతూ, 565 సంస్థానాలను ఏకం చేసి అఖండ భారతదేశాన్ని నిర్మించిన సర్దార్ పటేల్ దృఢ సంకల్పానికి నిదర్శనమని అన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి, క్రీడల అధికారి వెంకటనర్సయ్య, యువజన అధికారి రంజిత్ రెడ్డి, అర్బన్ తహసీల్దార్, ఎంఇఓలు, ట్రెస్మా టౌన్ అధ్యక్షులు, మై భారత్ కన్వీనర్లు, ప్రభుత్వ-ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు..



ప్రజావాణి దరఖాస్తు

తేది:17-11-2025

శ్రీయుత గౌరవనీయులైన జిల్లా కలెక్టర్
సిద్దిపేట గారికి నమస్కారములు

విషయం:- ప్రభుత్వ ఉద్యోగం చేస్తూ మద్యం సిండికేట్‌లో బినామీలుగా చలామణి అవుతున్న ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులపై చర్యలు తీసుకోవడం గురించి.

---

ఆర్యా,

నేను అనగా కరిపె మహేష్ తండ్రి బాల్‌నారాయణ గ్రామం కమ్మరపల్లి, మండలం దుబ్బాక జిల్లా సిద్దిపేట గారిని. దుబ్బాక మండలంలోని నాలుగు వైన్స్ షాప్స్ (మణికంఠ వైన్స్, బాలాజీ వైన్స్, లక్ష్మీ వైన్స్, రేణుక ఎల్లమ్మ వైన్స్) ఆగష్టు 2024 నుండి సిండికేట్‌గా ఏర్పడి ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా మద్యాన్ని అధిక ధరలకు విక్రయించి ఇటు ప్రభుత్వ ఆదాయానికి నష్టం చేయడమే కాకుండా వినియోగదారులను మోసం చేయడం జరిగింది.

ఇందులో ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్న కొమరవెల్లి మండల విద్యాధికారి బొమ్మగోని రమేష్‌గౌడ్, రేణుక ఎల్లమ్మ వైన్స్, తొగుట మండలం గోవర్ధనగిరి ప్రభుత్వ పాఠశాలలో టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న గొడుగు సత్యనారాయణ మణికంఠ వైన్స్‌లో వాళ్ల బంధువుల బినామీ పేర్ల మీద మద్యం వ్యాపారాలు చేస్తున్నారు. దీనికి సంబంధించిన ఆర్థిక లావాదేవీలు వీరి బ్యాంకు ఖాతాల ద్వారా లావాదేవీలు నిర్వహించినారు మరియు వైన్స్ సిండికేట్ నిర్ణయాలు వీరి ద్వారానే తీసుకోవడం జరిగింది. సిండికేట్ నిర్ణయాలు తీసుకున్నప్పుడు సాక్షులుగా ఇద్దరు ప్రభుత్వ టీచర్లు సంతకాలు పెట్టిన బాండ్ పేపర్లను ఈ దరఖాస్తులో జతపరచడం జరిగింది. ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తూ మద్యం సిండికేట్‌లో భాగస్వాములైన వీరిద్దరిపై పూర్తి స్థాయిలో విచారణ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోగలరని మనవి.

ఇట్లు

కరిపె మహేష్ తండ్రి బాల్‌నారాయణ
గ్రామం కమ్మరపల్లి
మండలం దుబ్బాక, జిల్లా సిద్దిపేట.
సెల్ నం.9000558215



# లిక్కర్ సిండికేట్‌లో ప్రభుత్వ ఉద్యోగులు

- **బినామీ పేర్లతో మద్యం వ్యాపారం**
- **సిండికేట్ అగ్రిమెంట్ లో సాక్షులుగా ప్రభుత్వ ఉద్యోగులు**
- **మద్యం సిండికేట్ లో ఉద్యోగుల పాత్రపై అధికారుల ఆరా.!**
- **ప్రజావాణిలో లిక్కర్ సిండికేట్ వ్యవహారంపై ఫిర్యాదు**

**దుబ్బాక, నవంబర్ 17 (ప్రజాస్వరం) :**

దుబ్బాక మద్యం సిండికేట్ వ్యవహారం ప్రజావాణిలోకి చేరింది. సిద్దిపేట జిల్లా కలెక్టరేట్ లో సోమవారం జరిగిన ప్రజావాణిలో లిక్కర్ వ్యాపారం బయటకు వచ్చింది. దుబ్బాక లోని రేణుక ఎల్లమ్మ, బాలాజీ, మణికంఠ, లక్ష్మీ వైన్స్ యజమానులు కలిసి ఆగస్టు 2024లో సిండికేట్ గా ఏర్పాటు చేసుకుని అక్రమ దందాకు తెరదించారు. ఈ అక్రమ వ్యవహారం అప్పటినుంచి ఇప్పటివరకు మూడు పూలు ఆరుకాయలుగా సిండికేట్ వ్యవహారం నడుస్తుంది. ఈ లిక్కర్ సిండికేట్ లో ప్రభుత్వ ఉద్యోగుల పాత్ర ప్రత్యక్షంగా, పరోక్షంగా కనబడుతోంది. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా గతేడాది ఆగస్టులో ఏర్పాటు చేసుకున్న లిక్కర్ సిండికేట్ ఒప్పంద పత్రంలో సాక్షులుగా ప్రభుత్వ ఉద్యోగులైన సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండల విద్యాధికారి బొమ్మగోని రమేశ్ గౌడ్, తొగుట మండలం చిన్న ముత్యం పేట ప్రాథమిక పాఠశాల టీచర్ గొడుగు సత్యనారాయణలు సంతకాలు పెట్టిన కాఫీని ప్రజావాణిలో సమర్పించారు. ప్రభుత్వ ఉద్యోగులు ప్రైవేటుగా ఆర్థిక లావాదేవీలు, క్రయవిక్రయాలు చేయొద్దనే ప్రభుత్వ నిబంధనలు ఉన్నప్పటికీ అవేమీ తమకు పట్టినట్టుగా సదరు ఉద్యోగులు వ్యవహరించి ఆర్థిక కార్యకలాపాలు జరిపారు. సదరు ఉద్యోగుల బ్యాంకు స్టేట్ మెంట్ పై విచారణ చేపడితే పూర్తి సమాచారం బయటకు వచ్చే అవకాశం లేకపోలేదు. రేణుకా ఎల్లమ్మ వైన్స్ ను 2023_2025 ఏడాదిగాను మండల పరిధిలోని దుంపల పల్లి గ్రామానికి చెందిన దినేశ్ గౌడ్ కు లాటరీ ద్వారా వచ్చింది. దినేశ్ గౌడ్ నుండి ఎంఈఓ రమేశ్ గౌడ్ రూ. 67 లక్షలకు కొనుగోలు చేశాడు. చిన్న ముత్యం పేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో టీచర్ గా విధులు నిర్వహిస్తున్న గొడుగు సత్యనారాయణ మణికంఠ వైన్స్ లో 10 శాతం షేర్ హోల్డర్ గా ఉన్నట్లు తెలిసింది. చిన్నారి పిల్లలకు విద్యా బుద్ధులు చెప్పాల్సిన బడి పంతుళ్లకు మద్యం దందా బయటకు రావడంపై ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది. మండలంలో 134 బెల్ట్ షాపులు ఉన్నాయి. సిండికేట్ వైన్స్ ల నుంచి బెల్టు దుకాణాలకు సరఫరా అయ్యే క్వార్టర్ పై అదనంగా రూ. 3.50 వసూలు చేస్తున్నారు. దుబ్బాక వైన్స్ లల్లో రోజుకు సుమారుగా రూ. 15 లక్షల వరకు గిరాకీ నడుస్తోంది. లిక్కర్ సిండికేట్ వ్యవహారంపై జిల్లా ఉన్నతాధికారులు ఆరా తీస్తున్నట్లు తెలిసింది. మద్యం ప్రియుల జేబులకు చిల్లులు పొడుస్తున్న లిక్కర్ సిండికేట్ యాజమానులు, సిండికేట్ లో భాగస్వాములైన ప్రభుత్వ ఉద్యోగులపై ఎలాంటి చర్యలు ఉంటాయో వేచి చూడాల్సిందే.

## సంగమేశ్వర స్వామి ఆలయంలో కార్తీకమాసం ఉత్సవాలు

**మాసాయిపేట, నవంబర్ 18( ప్రజాస్వరం) :**

మండల కేంద్రంలోని శ్రీ భవాని సంగమేశ్వర స్వామి దేవాలయంలో కార్తీకమాసం ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. కార్తీక మాసం చివరి సోమవారం పురస్కరించుకొని ఆలయ ప్రాంగణంలో గణపతి హోమం, శివుడికి రుద్రాభిషేకం, కుంకుమార్చన, గోమాత పూజ, నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో అష్ట సహస్ర దీపోత్సవం కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. పెద్ద ఎత్తున భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.





## పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే

**దౌల్తాబాద్ నవంబర్ 17 (ప్రజా స్వరం) :**

ప్రజల జీవన స్థితిగతులను అధ్యయనం చేసే లక్ష్యంతో కేంద్ర గణాంక శాఖ నిర్వహిస్తున్న పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే ( PLFS) రాయపోల్ మండల పరిధిలో సోమవారం ప్రారంభమైంది. గణాంక శాఖ అధికారి గుర్రం శ్రీనివాస్ గౌడ్ చిన్న మాసన్‌పల్లి గ్రామంలో గృహాలను సందర్శిస్తూ సర్వే ప్రక్రియను ప్రారంభించారు. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన పట్టణాలు, గ్రామాల్లో ప్రజల ఉపాధి స్థితిగతులను తెలుసుకునే కార్యక్రమంలో భాగంగా చిన్న మాసన్‌పల్లి గ్రామాన్ని ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. ముందుగా కుటుంబాల సాధారణ వివరాలను సేకరించిన అనంతరం, ప్రత్యేక ట్యాబ్ ద్వారా ఎంపికైన కొన్ని కుటుంబాలను మూడు నెలలకు ఒకసారి సందర్శించి పూర్తి స్థాయి వివరాలను నమోదు చేస్తామని చెప్పారు. ఈ సర్వేలో కుటుంబ యజమాని, కుటుంబ సభ్యుల వివరాలు, విద్యార్హతలు, వృత్తి, చదువుతున్న కోర్సులు, స్వయం ఉపాధి అవకాశాలు వంటి అంశాలను నమోదు చేసి కేంద్రానికి పంపుతారని శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాయపోల్ ఎంపీడీవో జమ్లా నాయక్, ఎంపీఓ శ్రీనివాస్, గ్రామపంచాయతీ కార్యదర్శి లావణ్య, ఫీల్డ్ అసిస్టెంట్ యాదగిరి, అంగన్వాడీ టీచర్ స్వప్న, ఆశా వర్కర్ లక్ష్మి, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం విజయవంతం

- **గణపతి పూజతో ప్రారంభం**

**దౌల్తాబాద్ నవంబర్ 17( ప్రజాస్వరం ) :**

గ్రామంలో శ్రీ ఆంజనేయ స్వామి వారి వార్షికోత్సవ వేడుకలు భక్తి శ్రద్ధల నడుమ అత్యంత విజయవంతంగా నిర్వహించారు. భక్తులు ఆసక్తిగా ఎదురుచూసే ఈ ఉత్సవాలు ఈసారి మరింత భక్తి పరవశంతో సాగాయి. ప్రారంభ కార్యక్రమాలు గణపతి పూజతో మొదలై, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని శ్రీవారి దర్శనం చేసుకున్నారు. తరువాత రుద్రాభిషేకం, సింధూర లేపనం, షోడశోపచార పూజ, మంగళహారతి, మంత్రపుష్పం, అగ్ని ప్రతిష్ట, నవగ్రహ స్థాపన, దేవత రుద్ర మాన్య సూక్త పఠనం, హోమం, బలిహరణ, పూర్ణాహుతి, తీర్థప్రసాదం, అన్న ప్రసాదాల పంపిణీ, శివపార్వతుల కళ్యాణం, మంగళహారతి, మంత్రపుష్పం వంటి పూజా కార్యక్రమాలను ఆలయ నిర్వాహకులు ఎంతో శ్రద్ధతో నిర్వహించారు. గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్న గణపతి పూజ అనంతరం ఆంజనేయ స్వామి వారికి ప్రత్యేక అలంకరణలు, అభిషేకాలు నిర్వహించగా, ఆలయ ప్రాంగణం భక్తులతో కళకళలాడింది. హనుమద్జయంతి వేడుకలను తలపించేలా ప్రాంతం మొత్తం ఆధ్యాత్మిక వాతావరణంతో నిండిపోయింది. స్థానికులు మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం జరిగే ఈ వార్షికోత్సవం గ్రామానికి ఆధ్యాత్మిక శోభను చేకూర్చుతోందని, ముఖ్యంగా యువతలో సేవాభావాన్ని పెంపొందించటంలో కీలక పాత్ర పోషిస్తుందని అభిప్రాయపడ్డారు. అనంతరం జరిగిన అన్నదానంలో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. గ్రామ ప్రజల సహకారం, ఆలయ కమిటీ సభ్యుల శ్రమతో ఈసారి వార్షికోత్సవం అత్యంత విజయవంతంగా ముగిసిందని నిర్వాహకులు తెలిపారు.



## చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి

**దుబ్బాక, నవంబర్ 17 (ప్రజాస్వరం) :**

ఒంటరితనం అనుభవించలేక జీవితం మీద విరక్తి చెందిన వృద్ధుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయగా, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన దుబ్బాక మండలం రాజక్క పేట గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. దుబ్బాక ఎస్ఐ కీర్తి రాజు తెలిపిన వివరాల ప్రకారం రాజక్క పేట గ్రామానికి చెందిన కోమటిరెడ్డి నారాయణ రెడ్డి(75) అనే వృద్ధుడికి ఎవరూ లేకపోవడంతో గత కొంతకాలంగా ఒంటరిగా జీవనం కొనసాగిస్తున్నాడు.9 సంవత్సరాల క్రితమే భార్య కూడా మరణించింది.దీంతో గత కొంతకాలంగా ఒంటరితనంపై విసుగు చెందిన వృద్ధుడు ఈ నెల 13వ తేదీన చేల్లాపూర్ శివారులో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. వెంటనే గుర్తించిన బంధువులు అతని చికిత్స నిమిత్తం సిద్దిపేట జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ, నేడు ఉదయం మృతి చెందాడు.శవ పరీక్ష నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని వారి బంధువులకు అప్పగించారు.మృతుని మరదలు మంజుల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

# వృద్ధుల హక్కులే ప్రధానం వయోవృద్ధుల సంక్షేమమే లక్ష్యం

- **ఆర్డీవో డి సుబ్రహ్మణ్యం.**

**వనపర్తి,నవంబర్ 17(ప్రజాస్వరం):**

వయోవృద్ధులు కుటుంబానికి, సమాజానికి అద్దం పట్టే విలువల ప్రతిరూపమని, వారిని గౌరవించడం ప్రతి తరానికి బాధ్యత అని జిల్లా రెవెన్యూ అధికారి దరూరు సుబ్రహ్మణ్యం తెలిపారు. వయోవృద్ధుల వారోత్సవాల్లో భాగంగా, మహిళా-శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా సంక్షేమ అధికారి కె. సుధారాణి పర్యవేక్షణలో జిల్లా కేంద్రంలో అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో మాట్లాడుతూ ఆర్డీఓ— "వయోవృద్ధుల హక్కుల పరిరక్షణ కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న ఎండబ్ల్యూపీఎస్సీ యాక్ట్ -2007 ప్రతి ఇంటికీ అర్థమయ్యేలా ఉండాలన్నారు. తల్లిదండ్రుల పోషణ బాధ్యత పిల్లలదే. వారి పోషణ, వైద్యం, భద్రతకు కుటుంబ సభ్యులు కట్టుబడి ఉండాలి" అని స్పష్టం చేశారు. 90 రోజుల్లో విచారణ-ఉత్తర్వులుమెయింటెనెన్స్ ట్రిబ్యునల్ వ్యవహారంపై వివరించిన ఆర్డీఓ "వృద్ధులు దరఖాస్తు సమర్పించిన వెంటనే 90 రోజుల్లో విచారణ పూర్తి చేస్తాం. పిల్లలకు నోటీసులు పంపడం,వాదనలు, సాక్ష్యాలు సేకరించడం,చివరకు పోషణ ఖర్చులపై ఉత్తర్వులు ఇవ్వడం అన్నీ చట్టపరంగా నిర్వహిస్తాం" అని చెప్పారు. అలాగేపోషణ ఖర్చు అంటే ఏమిటి?

**ఎవరు ఎక్కడ దరఖాస్తు ఇవ్వాలి?**

గిఫ్ట్ డీడ్ ఇచ్చిన తల్లిదండ్రుల హక్కులు ఏవి? వంటి అంశాలను పాల్గొనేవారికి వివరించారు. అధికారులు,కమిటీ సభ్యుల పాల్గొనడం




ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ లీగల్ సర్వీస్ అథారిటీ చీఫ్ ఎల్ ఏ డి సి బాలయ్య, అసిస్టెంట్ అసిస్టెంట్ ఎల్ఏ డి సి శ రఘు,సిడిపిఓ వనపర్తి,వయోవృద్ధుల కమిటీ సభ్యులు నాగేంద్రం,చిన్నమ్మ థామస్,నరసింహ గౌడ్,సమర్ రెహ్మాన్మనిస్,అమీర్,వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపక్షం జర్నలిస్ట్ బి రాజమౌళిని పరామర్శించిన చాడ

**చిగురుమామిడి,(ప్రజాస్వరం):**

చిగురుమామిడి మండలంలో ప్రజాపక్షం దినపత్రిక లో పనిచేస్తూ గత వారం రోజుల క్రిందట వార్త సేకరణతో పాటు క్యాలండర్ బకాయిల కోసం మండలంలో పర్యటించి ఇంటికి తిరిగి వస్తున్న నేపథ్యంలో చిగురుమామిడి లో అతివేగంగా వచ్చిన కుక్క బైక్ ను ఢీకొట్టగా క్రింద పడటంతో కాలికి గాయమైంది , సిపిఐ బస్సు జాత కార్యక్రమములో చిగురుమామిడి మండల కేంద్రంలో సమావేశం అనంతరం,ఈ విషయాన్ని తెలుసుకున్న సిపిఐ ఇందుర్తి మాజీ శాసనసభ్యులు చాడ వెంకటరెడ్డి బొలుమల్ల రాజమౌళి పరామర్శించారు ప్రమాద విషయాలను అడిగి తెలుసుకున్నారు ఈ పరామర్శ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కల్లపల్లి శ్రీనివాసరావు,సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు అలవేణి శంకర్,సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్,సిపిఐ జిల్లా మాజీ కార్యదర్శి పొన గంటి కేదార్, సిపిఐ జిల్లా కార్య వర్గ సభ్యులు బోయిని అశోక్,సిపిఐ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు చాడ శ్రీధర్ రెడ్డి,సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు మావురపు రాజు, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు ముద్ర కోల రాజయ్య,సిపిఐ గాగిరెడ్డిపల్లి గ్రామ శాఖ కార్యదర్శి ఎల్లయ్య, గందె కొమురయ్య సిపిఐ కార్యకర్తలు తదితరులున్నారు




## ప్రజా సంక్షేమ సేవలకి ప్రతీక: బొంతు శ్రీదేవి జన్మదిన వేడుకలు ఘనంగా

**చర్లపల్లి,నవంబర్ 17(ప్రజాస్వరం):**

చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్, జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యురాలు బొంతు శ్రీదేవి జన్మదిన వేడుకలు సోమవారం చక్రిపురం, రెడ్డి కాలనీలో నిర్వహించబడ్డాయి. స్థానికులు, పార్టీ నేతలు, సంఘ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రముఖ నాయకులు, ప్రత్యేకించి మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ ఇంచార్జ్ హరి వర్ధన్ రెడ్డి, ఉప్పల్ కాంగ్రెస్ ఇంచార్జ్ మందమల పరమేశ్వర్ రెడ్డి, మల్కాజ్గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు,పజ్జూరి పావని రెడ్డి,ఇతర కార్పొరేటర్లు, పార్టీ నాయకులు ఈ సందర్భంగా పాల్గొన్నారు. జన్మదిన సందర్భంలో ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, మొక్కల నాటడం, పేదవారికి అవసరమైన వస్తువుల పంపిణీ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. బొంతు శ్రీదేవి, ప్రజల ఆశీర్వాదాలు తానికెంతో ప్రేరణగా ఉంటాయని,మరింత సేవ చేయడానికి ప్రోత్సాహంగా మారుతాయని తెలిపారు.





## ప్రతిభాపురస్కార గ్రహీత రాజా గౌడ్‌కు ఘన సన్మానం

**వనపర్తి,నవంబర్ 17(ప్రజాస్వరం):**

హైదరాబాద్‌లోని పేట్లబుర్జ్ సిటీ పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో ఇటీవల మూడు రోజులపాటు జరిగిన పీఆర్వోలు శిక్షణ శిబిరంలో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన వనపర్తి జిల్లా ఎస్పీ కార్యాలయ పీఆర్వో రాజా గౌడ్‌ను సాహితీ-కళా వేదిక ప్రతినిధులు సోమవారం ఘనంగా సన్మానించారు. స్థానిక రేడియంట్ హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో జిల్లా కళావేదిక అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ మాట్లాడుతూ— రాజా గౌడ్ తన వృత్తిధర్మాన్ని నిబద్ధతతో నిర్వర్తిస్తూ రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందడం గర్వించదగిన విషయమని తెలిపారు. రాష్ట్ర డీజీపీ శివదర్ రెడ్డి చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకోవడం ఆయన కృషికి నిదర్శనం అన్నారు.




గత దశాబ్దంగా రాజా గౌడ్ సమాజ సేవలో చేపడుతున్న పలు కార్యక్రమాలను శంకర్ గౌడ్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. సన్మాన కార్యక్రమంలో కళావేదిక నాయకులు బైరోజు చంద్రశేఖర్, దేశి రాములు యాదవ్, బండారు శ్రీనివాస్,గంధం నాగరాజు,కంటే నిరంజనయ్య,డా.నరేష్‌కుమార్, చిన్న రాములు,కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సుంకిశాల గ్రామంలో శ్రీ వెంకటేశ్వర కళ్యాణం

**వలిగొండ,నవంబర్ 17(ప్రజాస్వరం):**

యాదాద్రి భువనగిరి జిల్లావలిగొండ మండలం సుంకిశాల గ్రామంలో శ్రీ వెంకటేశ్వర స్వామి 28వ బ్రహ్మోత్సవాలు సందర్భంగా డాక్టర్ పైళ్ళ మల్లారెడ్డి సాధన యూఎస్ఏ వారి ఆధ్వర్యంలో, సోమవారం మధ్యాహ్నం 12 గంటలకుశ్రీశ్రీ వెంకటేశ్వర స్వామికా వారి కళ్యాణం అంగరంగ వైభవంగా యాదగిరిగుట్టు ప్రధాన అర్చకులు కారంపొడి నరసింహ చార్యులు అర్చకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు .ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భువనగి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించి స్వామివారి ఆశీర్వాదాలు పొందారు, పైల్ల మల్లారెడ్డి కుటుంబ సభ్యులు మరియు అన్నప్రసాద కార్యక్రమం పైళ్ళసంజీవరెడ్డి,మనోరమ్మ, కుటుంబ సభ్యులు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో శ్రీ వెంకటేశ్వర స్వామి చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు అర్చకులు గ్రామ ప్రజలు మహిళలు మండల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## వనపర్తిలో అక్రమ పార్కింగ్‌పై ట్రాఫిక్ శాఖ కఠిన హెచ్చరిక

- **షాపు యజమానులకు అవగాహన.**
- **ట్రాఫిక్ ఎస్ఐ సురేందర్.**

**వనపర్తి,నవంబర్ 17 (ప్రజాస్వరం):**

పట్టణంలో పెరుగుతున్న అక్రమ పార్కింగ్, రహదారులపై ఏర్పడుతున్న అడ్డంకులను నివారించేందుకు ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలో అవగాహన కార్యక్రమం చేపట్టారు. జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ఆదేశాల మేరకు ట్రాఫిక్ ఎస్సై సురేందర్ షాపుల యజమానులతో సమావేశమై పార్కింగ్ నియమాలపై వివరణ ఇచ్చారు. షాపుల ముందర వాహనాలను అడ్డంగా పార్క్ చేయడం వల్ల సాధారణ ప్రజలు, రోగి రవాణా, అత్యవసర సేవలకు తీవ్రమైన ఇబ్బందులు కలుగుతున్నాయని అధికారులు హెచ్చరించారు.రహదారులు ప్రజలకేనని, వాటిని ఆక్రమించడం చట్టపరంగా తప్పు మాత్రమే కాకుండా సామాజిక బాధ్యతారాహిత్యమని వ్యాపారులకు తెలిపారు. ట్రాఫిక్ ఎస్సై సురేందర్ మాట్లాడుతూ— "సమాజంకోసం రోడ్డు,రోడ్డు కోసం నియమాలు అవసరం. షాపుల ముందు వాహనాలు నిలిపివేయడం వల్ల రోడ్లు బ్లాక్ అవుతున్నాయి. ముందుగా అవగాహన, తర్వాత అమలు... కానీ తప్పులు పునరావృతమైతే చట్టపరమైన చర్యలు తప్పవు. రోడ్డు సంస్కృతి మారితేనే ట్రాఫిక్ సమస్యలు తగ్గుతాయి. పోలీసులతో పాటు ప్రతి పౌరుడు, ప్రతి వ్యాపారి బాధ్యతతో నడుచుకోవాలి" అని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్

**వలిగొండ,నవంబర్ 17(ప్రజాస్వరం):**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం కొనుగోలు కేంద్రాలకు కాంట్రాక్టర్లు సరిపడ లారీలు పంపించాలని లేనిచో చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ హనుమంతరావు హెచ్చరించారు.సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం సంగెం ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...ఈరోజు ఎన్ని ధాన్యం కుప్పలు కొనుగోలు చేశారు, ఇంకా తేమ శాతం వచ్చిన ధాన్యం కుప్పలు ఎన్ని ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు.ఎంత లేట్ అయినా ఉండి లైట్ ఏర్పాటు చేసుకొవలి అని అన్నారు.



## జిల్లాలో నిర్ధారిత వరి కొనుగోలు కేంద్రాలు అన్ని వెంటనే ప్రారంభించాలి

- **ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే డాటా ఎంట్రీ చేయాలి**
- **జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**

**వపర్తి,నవంబర్ 17(ప్రజాస్వరం):**

జిల్లాలోని అన్ని వరి కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సోమవారం సాయంత్రం తన ఛాంబర్‌లో జిల్లా అధికారులతో వరి కొనుగోలు పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించిన కలెక్టర్, పానగల్ మండలంలో ఇప్పటికే కోతలు ప్రారంభమైన నేపథ్యంలో ఐకెపి, సహకార సంఘాలు సమన్వయంతో తక్షణమే కొనుగోలు కేంద్రాలు తెరవాలని సూచించారు. కలెక్టర్ మాట్లాడుతూ "రైతు ధాన్యం తూకం చేసిన వెంటనే డబ్బులు వారి ఖాతాలో జమ అయ్యేలా చర్యలు తీసుకోవడం అధికారుల ప్రధాన బాధ్యత" అన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం, రైతు వివరాలను ఆలస్యం లేకుండా ఆన్లైన్లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోలు, డేటా ఎంట్రీ మధ్య పొంతన లేకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలో ఇప్పటివరకు 291 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి 13,000 మెట్రిక్ టన్నుల వరి కొనుగోలు చేసినప్పటికీ, అందులో 10,682 మెట్రిక్ టన్నులు మిల్లులకు తరలించగా కేవలం 6,000 మెట్రిక్ టన్నులకు మాత్రమే డేటా ఎంట్రీ చేసిన విషయాన్ని కలెక్టర్ తీవ్రంగా తప్పుపట్టారు. ఇప్పటి వరకు 876 మెట్రిక్ టన్నుల ధాన్యానికి రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసినట్లు వెల్లడించారు. రైతులకు చెల్లింపుల ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో ప్యాడి క్లీనర్ల వినియోగం తప్పనిసరి అని, నాణ్యమైన వడ్లు ఇస్తే మిల్లర్లు ఒక్క గ్రాము కూడా తరుగు తీయకూడదని హెచ్చరించారు. వడ్లు తరలించే అన్ని వాహనాలకు జియో ట్యాగింగ్ తప్పనిసరి చేస్తూ, సేకరించిన ధాన్యం కేటాయించిన మిల్లుల్లో లేదా గోదాముల్లోనే ఉండాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ పక్కదారి పట్టకూడదని స్పష్టం చేశారు.




అదేవిధంగా మిల్లర్లు బ్యాంక్ గ్యారంటీ తప్పనిసరిగా సమర్పించాలని, గ్యారంటీ ఇవ్వని మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని, అవసరమైతే వెంటనే సీజ్ చేయాలని సివిల్ సప్లై అధికారిని ఆదేశించారు. వరి కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి సమస్యలు ఉన్న వెంటనే తన దృష్టికి తీసుకురావాలని,అలసత్వం ఎవరు ప్రదర్శించినా కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎన్.ఖీమ్య నాయక్,జిల్లా సివిల్ సప్లై అధికారి విశ్వనాథ్,డీఎం జగన్మోహన్,జిల్లా వ్యవసాయ అధికారి ఆంజనేయులు,కోఆపరేటివ్ అధికారి ఇందిరా,ట్రాన్స్‌పోర్ట్ అధికారి మానస,మార్కెటింగ్ అధికారి స్వరణ్ సింగ్, గ్రామీణాభివృద్ధి శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పేదరి సొంతింటి కల నెరవేర్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే:భీమ్ భరత్.

**శంకర్ పల్లి నవంబర్ 17(ప్రజాస్వరం):**

పేదల గృహ కలలకు ఆచరణ రూపం దాల్చే పనిని కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్నదని చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ పామేన భీమ్ భరత్ పేర్కొన్నారు. శంకర్ పల్లి మండలం చందిప్ప గ్రామానికి చెందిన మొగులయ్య, లక్ష్మీ దంపతులకు ప్రభుత్వం తరపున మంజూరైన ఇందిరమ్మ ఇళ్లలో నిర్మాణం పూర్తి కావడంతో, వారి నూతన గృహాన్ని భీమ్ భరత్ ప్రారంభించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా దంపతులకు కొత్త వస్త్రాలు అందజేసి కుటుంబ సభ్యులను ఆశీర్వదించారు. సొంతిల్లు అనేది ఒక కుటుంబానికి భరోసా, భద్రత, ఆనందం అని భరత్ భావించారు. సొంత ఇల్లు పేద మనిషికి జీవిత ఉత్సాహం ఇస్తుంది. అని ఆయన పేర్కొన్నారు. పేదల సంక్షేమం, గృహ



హక్కు, సామాజిక భద్రత ఇవన్నీ కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రాధాన్యమని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరి సతీష్, జాతీయ నాయకులు షేర్ అనంత రెడ్డి, శంకర్ పల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ రవీందర్ రెడ్డి, శంకర్, బద్దం కృష్ణారెడ్డి, శ్రీనాథ్, సమీ, శివ, ప్రశాంత్ రెడ్డి, సేవాదళ్ మండల నాయకులు ఈశ్వర్, శంకర్, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## 'షీలీడ్స్' స్ఫూర్తి: మహిళా బ్లూ కోల్ట్స్ విప్లవం
# కరీంనగర్‌లో వినూత్న పోలీసింగ్

**కరీంనగర్,నవంబర్ 17 (ప్రజాస్వరం):**
'మేమున్నాం' అనే ధైర్యాన్ని, భరోసాను కేవలం మాటల్లో కాదు, చేతల్లో చూపిస్తున్నారు కరీంనగర్ పోలీసు కమీషనరేట్‌లోని మహిళా పోలీసులు. పోలీసు శాఖలో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుడుతూ, కరీంనగర్ పోలీసు కమీషనర్ గౌష్ ఆలం వినూత్నమైన 'షీలీడ్స్' శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించాడు. కేవలం ఆఫీస్ విధులకే పరిమితం కాకుండా, మహిళా పోలీసులను 'విజిబుల్ పోలీసింగ్'లో ముఖ్య భాగస్వామ్యం చేసేందుకు వారికి 'బ్లూ కోల్ట్స్' విధులు కేటాయించడం, ఈ ఆలోచన ఇప్పటికే సత్ఫలితాలనిస్తోంది. ప్రజలకు భద్రతపై మరింత దృఢమైన నమ్మకాన్ని కల్పించడంలో మహిళా బ్లూ కోల్ట్స్ కీలకపాత్ర పోషిస్తున్నారు. అయితే క్షేత్ర స్థాయిలో సంఘటనలు ఎదురైనపుడు సమర్ధవంతంగా ఎదుర్కొనేలా మహిళా పోలీసులను తీర్చిదిద్దడం ఈ కార్యక్రమ ముఖ్యోద్దేశం అని సీపీ తెలిపారు.

**క్షేత్ర స్థాయిలో ఎదుర్కొనే సవాళ్లకు సమగ్ర శిక్షణ**
'పోలీసు శాఖలో విధులు నిర్వహించాలంటే శారీరక ధృడత్వంతో పాటు మానసికంగా కూడా ధృడంగా ఉండాలని, మనల్ని మనం రక్షించుకునే స్థితిలో ఉన్నపుడే ప్రజలను రక్షించగలం' అని సీపీ గౌష్ ఆలం ఈ సందర్భంగా ఉద్ఘాటించారు. ఈ నినాదానికి అనుగుణంగానే, దాదాపు 100 మంది మహిళా పోలీసులకు (షీ టీమ్స్ సభ్యులతో సహా) రెండు దశల్లో కరీంనగర్ కమీషనరేట్ కేంద్రంలో ప్రత్యేక శిక్షణను అందిస్తున్నామని తెలిపారు.

**కరాటే (అన్ ఆర్మ్డ్ కంబాట్ కోర్స్):**
ఆత్మరక్షణ విద్యలో సుశిక్షితులుగా తీర్చిదిద్దడం ఈ శిక్షణ ప్రధాన లక్ష్యమని, వీరు తమను తాము రక్షించుకోవడమే కాక, ఆపదలో ఉన్న పౌరులకు రక్షణ కల్పించేలా వీరికి శిక్షణ అందిస్తున్నామన్నారు.

**నిరసనకారుల నిర్వహణపై శిక్షణ:**
ధర్నాలు, నిరసనల్లో ముఖ్యంగా మహిళా నిరసనకారులను తరలించే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు మరియు మెళకువలపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఈ సున్నితమైన అంశాలను ఎలా సమర్ధంగా, మానవీయంగా నిర్వహించాలో నేర్పిస్తున్నామన్నారు.

**మానసిక ఒత్తిడి అధిగమనం:**
కఠినమైన క్షేత్ర స్థాయి విధుల్లో ఎదురయ్యే ఒత్తిడిని అధిగమించేందుకు, పోలీసులకు మానసిక ధృడత్వాన్ని పెంచేలా ఈ శిక్షణ కార్యక్రమాన్ని రూపొందించామని సీపీ తెలిపారు.

**భరోసాకి కొత్త అర్థం**
క్షేత్ర స్థాయిలో సంఘటనలు ఎదురైనపుడు, ఏ మాత్రం తొట్రుపాటు లేకుండా వాటిని ధైర్యంగా ఎదుర్కొనేలా ఈ శిక్షణ మహిళా పోలీసులను సన్నద్ధం చేస్తోంది. విధి నిర్వహణలో నిరంతర అప్రమత్తత అవసరమని, నేర్చుకున్న ఈ అంశాలను అవసరమైతే తప్పకుండా ఉపయోగించుకోవాలని సీపీ మహిళా పోలీసులకు సూచించారు. కరీంనగర్ పోలీసు కమీషనరేట్ తీసుకున్న ఈ 'షీలీడ్స్' చొరవ, మహిళా శక్తిని కేవలం కార్యాలయానికే పరిమితం చేయకుండా, ప్రజల్లోకి తీసుకెళ్లడం ద్వారా వారికి మరింత దగ్గరయ్యేలా చేస్తుందని సీపీ ఆశాభావం వ్యక్తం చేసారు. మహిళా బ్లూ కోల్ట్స్ బృందం వీధుల్లో తిరుగుతుంటే, తమకు రక్షణ ఉందనే ధైర్యం, ఆత్మవిశ్వాసం ప్రజల్లో మరింత పెరుగుతాయని సీపీ అభిప్రాయపడ్డారు. ఈ వినూత్న సంస్కరణ ద్వారా కరీంనగర్ పోలీసు శాఖ కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టి సత్ఫలితాలనిస్తుందని సీపీ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ భీంరావు,ఏసీపీ శ్రీనివాస్ జి, వేణుగోపాల్,మాధవి కరాటే మాస్టర్ వసంత్ కుమార్ ఇతర ఇన్స్పెక్టర్లు మరియు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.




## జిల్లా ప్రజల సమస్యలను పరిష్కరించడంలో
# అధికారులు మరింత శ్రద్ధ వహించాలి

- **వచ్చిన ఫిర్యాదులు మళ్ళీ మళ్ళీ పునరావృత్తం కాకుండా వెంటనే పరిష్కరించాలి**
- **జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి**
- **ప్రజల నుండి ప్రజావాణిలో ఫర్యాదులు స్వీకరించిన జిల్లా కలెక్టర్**
- **ప్రజావాణికి (22) ఫిర్యాదులు**

**రంగారెడ్డి నవంబర్ 17(ప్రజాస్వరం):**
సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి (22) ఫిర్యాదులు అందాయి. ప్రజల నుండి వివిధ అంశాలకు సంబంధించిన ఫిర్యాదుల వినతిపత్రాలు జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి స్వీకరించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ప్రజల సమస్యలను పరిష్కరించడంలో అధికారులు మరింత శ్రద్ధ కనబరచాలని, వచ్చిన ఫిర్యాదులు మళ్ళీ మళ్ళీ పునరావృత్తం కాకుండా వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అధికారులకు సూచించారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమము కేవలం సమస్యలు విని దరఖాస్తులు స్వీకరించే విధంగా కాకుండా, పరిష్కారాల వేదికగా నిలిచేలా ప్రతి ఒక్కరు పని చేయాలని, ఫిర్యాదులు స్వీకరించిన వెంటనే పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. ప్రజావాణి కార్యక్రమాన్ని సమస్యలు పరిష్కరించే వేదికగా మార్చాలని, తెలిపారు. ఫిర్యాదులు సమర్పించడానికి వచ్చిన ప్రజలకు అవసరమైన సూచనలు, సహాయం అందించడంలో అధికారులు సిబ్బంది చొరవ చూపాలని అన్నారు.
రెవెన్యూ శాఖ-8, ఇతర శాఖలు - 14, మొత్తం 22 దరఖస్తులు అందాయి. అనంతరం జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి జిల్లా అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి కలెక్టర్ మాట్లాడుతూ కందుకూర్ మండలం మీర్ఖాన్ పేట్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 8 మరియు 9వ తేదీలలో నిర్వహించే గ్లోబల్ సమ్మిట్ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లలో ఎక్కడ ఎలాంటి పొరపాట్లు జరగకుండా సంబంధిత అధికారులు తమకు నిర్దేశించిన పనులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల పేమెంట్ చేయడంలో వేగవంతగా పని చేయాలని అన్నారు. మహిళా చెస్ ఛాంపియన్ షిప్ టోర్నమెంట్ లో గెలుపొందిన అత్తాపూర్ జిల్లా పరిషత్ హై స్కూల్ నందు 10వ తరగతి చదువుతున్న జి.శివంశికను కలెక్టర్ అభినందించారు. నషా ముక్త్ భారత్ అనే పోస్టర్ ను జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి రిలిజీ చేశారు.
ఈ ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) శ్రీనివాస్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహాశీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





## రైతుల సమస్యపై మాజీ ఎమ్మెల్యే ధర్నా

**మక్తల్,నవంబర్ 17(ప్రజాస్వరం):**
ఆరుగాలం కష్టపడి పొలాల్లో పండించిన పత్తి పంటను ప్రభుత్వం కొనకపోవడం రైతులను తీవ్ర ఇబ్బందుల్లో పడ చేసింది. మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతుల పక్షం పట్టే విధానం లేకపోవడం గందరగోళానికి దారితీస్తోందని అన్నారు. సోమవారం మాగనూరు మండలం వడ్వాట్ రోడ్‌లోని పత్తి మిల్లులో పత్తి కొనుగోలు నిలిపివేయడంతో, ఆగ్రహించిన రైతులు జాతీయ రహదారిపై నిరసన కార్యక్రమానికి దిగారు. సమాచారం అందుకున్న మాజీ ఎమ్మెల్యే అక్కడ చేరి, రైతుల పక్షంలో ధర్నాలో పాల్గొన్నారు.చిట్టెం రామ్మోహన్ రెడ్డి పేర్కొన్నట్టుగా, రైతులు పొలంలో పండించిన పంటను మాత్రమే కేంద్రాలకు ఇస్తారు; ప్రభుత్వం కొరవేల్లతో వ్యవహరిస్తుండటంతో, పంట కొనుగోలు నిలిపివేయడం రైతుల పరిస్థితిని మరింత కష్టతరం చేస్తుంది.



## బూత్ కమిటీల ఏర్పాటు ఎంతో కీలకం..

- **వార్డులలో పర్యటించి వైసిపి శ్రేణులతో భేటీ**
- **దక్షిణ వైయస్ఆర్సీపీ సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్**

**విశాఖపట్నం,నవంబర్ 17(ప్రజాస్వరం):**
వార్డ్ స్థాయిలో బూత్ కమిటీల ద్వారానే వైసీపీ పటిష్టం అవుతుందని మాజీ ఎమ్మెల్యే దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్కుమార్ అన్నారు. 32 34 36 37 వార్డులలో సోమవారం వాసుపల్లి గణేష్ కుమార్ పర్యటించారు. కార్పొరేటర్లు వార్డు అధ్యక్షుల తో సమావేశం నిర్వహించి బూత్ కమిటీ, వార్డు కమిటీ, అనుబంధ సంఘాల కమిటీలు ఎలా వేయాలో వారికి వివరించారు. ఈ సందర్భంగా వాసుపల్లి గణేష్ కుమార్ మాట్లాడుతూ వచ్చే ఏడాది జనవరిలో స్థానిక సంస్థల ఎన్నికలు ఉన్నాయని గుర్తు చేశారు. అలాగే మార్చిలో జీవీఎంసీ ఎన్నికలు వుంటాయన్నారు. కాబట్టి, బూత్ కమిటీల ఏర్పాటు ఎంతో కీలకం అన్నారు. పార్టీలో కష్ట బడి పనిచేసే వారికి ప్రాధాన్యత ఉంటుందని భరోసా ఇచ్చారు. ఇప్పటికే పార్టీ డిజిటల్ బుక్ ద్వారా నాయకులు కార్యకర్తల పని తీరును పార్టీ అధిష్టానవర్గం పరిశీలిస్తుందని పేర్కొన్నారు. కాబట్టి బూత్ కమిటీల ఏర్పాటు విషయంలో ఎలాంటి ఏమరపాటు వద్దని హితవు పలికారు. పని చేసే వారికి కమిటీలో ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సెల్ ప్రెసిడెంట్ సనపల రవీంద్ర భరత్,37వ వార్డ్ కార్పొరేటర్ చెన్నా జానకిరామ్, 32వ వార్డ్ అధ్యక్షులు రాజారెడ్డి, 34వ వార్డ్ లింగం శ్రీను,36 వ వార్డ్ అధ్యక్షులు మహమ్మద్ అబ్దుల్ షకిల్,37వ వార్డ్ అధ్యక్షులు ఆకుల యేసు,జిల్లా వైస్ ప్రెసిడెంట్ రేయి డేవిడ్ రాజు,జిల్లా జనరల్ సెక్రటరీ గంగళ్ల రామరాజు, సౌత్ ప్రెసిడెంట్లు ఈ కార్యక్రమంలో సౌత్ ప్రెసిడెంట్లు జిల్లా అధ్యక్షులు,జిల్లా కమిటీ,వార్డ్ కమిటీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## బీటి రోడ్డు మరమ్మతులు చేయాలి

- **సిపిఎం డిమాండ్**

**వలిగొండ,నవంబర్ 17(ప్రజాస్వరం):**
యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం వర్కట్పల్లి నేలపట్ల గ్రామాల మధ్యన బీటీ రోడ్డుకు మరమ్మత్తులు చేసి ఈదుల వాగుపై బ్రిడ్జిని నిర్మించాలని సిపిఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి డిమాండ్ చేశారు .
సోమవారం రోజున వరకట్పల్లి గ్రామంలో సిపిఎం గ్రామీణ కుటుంబాల సర్వే నిర్వహించారు ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి మాట్లాడుతూ నేలపట్ల వర్కట్ పల్లి గ్రామాల మధ్యన బీటీ రోడ్డుకు వెంటనే మరమ్మత్తులు చేపట్టి ఈదుల వాగుపై నూతన బ్రిడ్జిని నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. దశాబ్దాలుగా అనేకమంది ప్రజలు ఇబ్బందులు పడుతున్న పాలకులు మారుతున్నారే తప్ప బ్రిడ్జి నిర్మాణం చేయలేకపోయారని విమర్శించారు .
భువనగిరి నియోజకవర్గ చివరి చివరి గ్రామంగా ఉన్న వర్కట్పల్లిమునుగోడు నియోజకవర్గం చివరి గ్రామంగా ఉన్న నేలపట్ల గ్రామాల మధ్యన చిన్నపాటి వర్షాలు కురిసిన ఈదుల వాగులో నీరు ప్రవహించి ప్రయాణికు లతోపాటు వివిధ పరిశ్రమల్లో మరియు వివిధ పనుల కోసం చౌటుప్పల్ కు వెళ్లే వారు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గతంలో టిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు రెండు నియోజకవర్గాలకు చెందిన ఎమ్మెల్యేలు అధికార పార్టీకి చెందినప్పటికీ బ్రిడ్జి నిర్మాణాన్ని చేపట్టలేకపోయారని ప్రస్తుతం అధికార కాంగ్రెస్ పార్టీ రెండు నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలను కలిగి ఉన్నప్పటికీ సమస్యను పట్టించుకోవడంలేదని ఇప్పటికైనా బ్రిడ్జి నిర్మాణం కోసం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.
ఈ కార్యక్రమంలో పిఎన్ఎం జిల్లా కార్యదర్శి ఈర్లపల్లి ముత్యాలు,సిపిఎం వర్కట్పల్లి గ్రామ శాఖ కార్యదర్శి గూడూరు బుచ్చిరెడ్డి,నాయకులు మెట్టు రవీందర్ రెడ్డి,చేగురి నరసింహ, రోండి మల్లేష్,మాడుగుల వెంకటేశం,లక్ష్మయ్య,కృష్ణవేణి, కేసాని రాములు తదితరులు పాల్గొన్నారు.



## చేనేత కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి: జాన్ వెస్లీ

**మక్తల్,నవంబర్17(ప్రజాస్వరం):**
చేనేత కార్మికుల పరిస్థితులను పరిశీలించిన సిపిఎం రాష్ట్ర కార్యాధికారి జాన్ వెస్లీ, ప్రభుత్వానికి కడిగెచ్చి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. జాన్ వెస్లీ ముఖ్యంగా పేర్కొన్నారు లక్షల్లో ఉన్న చేనేత కార్మికుల రుణాలను తక్షణం మాఫీ చేయాలి. ఇప్పటికే వేరుపడిన 48 కోట్లు వెంటనే అమలు చేయాలి. చేనేత భరోసా పథకంలో జియో ట్యాగ్ పెట్టిన కార్మికులకు నేరుగా 2,000 రూపాయలు, అనుబంధ కార్మికులకు 500 రూపాయలు అందించాలి. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలను పెంచి అమలు చేయాలి. చేనేత పారిశ్రామిక సహకార సంఘాల క్యాష్ క్రెడిట్ రుణాలను మాఫీ చేయాలి. 12 సంవత్సరాలుగా నిర్వహించని సహకార సంఘాల ఎన్నికలను వెంటనే నిర్వహించి పాలక వర్గాన్ని ఏర్పాటు చేయాలి. మరణించిన చేనేత కార్మికులకు త్రిఫ్ పథకం ద్వారా భీమా నిధులు తక్షణం అందజేయాలి. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఇంటి స్థలంతో పాటు వర్క్ షెడ్లు నిర్మించాలి. చేనేత కార్మికులకు ఐదు లక్షల రూపాయల వరకు ఆరోగ్య భీమా కల్పించాలి. పెట్టుబడి సాయం కింద రాయితీతో, వడ్డీ లేకుండా కొత్త రుణాలు ఐదు లక్షల వరకు ఇవ్వాలి. చేనేత వస్త్ర నిల్వలను ప్రభుత్వం కొనుగోలు చేయాలి; ప్రభుత్వ రంగ సంస్థలకు ఏకరూప దుస్తులను చేనేత మగ్గాల ద్వారా సరఫరా చేయాలి. 11 రకాల వస్త్రాలను రిజర్వ్ చేసిన చేనేత రిజర్వేషన్ చట్టాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయాలి. డూప్లికేట్ ముద్రిత వస్త్రాలను అరికట్టాలి. రేషన్ షాపుల ద్వారా చీర, ధోవతి, లుంగీ వంటి చేనేత వస్త్రాలను ప్రజలకు అందించాలి. జాన్ వెస్లీ హెచ్చరించారు, ఈ డిమాండ్లు వెంటనే అమలు కాకపోతే సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యక్ష ఆందోళన, పోరాటానికి సిద్ధమని. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నేతలు,జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మరియు స్థానిక చేనేత కార్మికులు పాల్గొన్నారు.




EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336,
EDITOR: PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999